ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 29, మే 2025



ఒంగోలు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో నాట్యం చేస్తున్న కళాకారులు

ఎన్టీఆర్‌కు ఘననివాళి

జిల్లావ్యాప్తంగా జయంతి వేడుకలు

- ఈసారి ప్రభుత్వపరంగా కూడా నిర్వహణ
- ఆయన స్ఫూర్తితో అభివృద్ధికి పాటుపడాలని పలువురు పిలుపు



ఒంగోలులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, టీడీపీ నేతలు

ఒంగోలు మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీరామారావుకు విభిన్న వర్గాల ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి అన్నివర్గాల వారు కృషిచేయాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతులను సాధారణంగా పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు నిర్వహిస్తుంటాయి. ఈసారి జయంతి వేడుకలను ప్రభుత్వపరంగా కూడా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బుధవారం జిల్లావ్యాప్తంగా ఒకవైపు అధికార యంత్రాంగం, మరోవైపు టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున ఈ వేడుకలను నిర్వహించి ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలులోని అద్దంకి బస్టాండు సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఇతర అధికారులు, ఇటీవల పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ కె.సీతారామయ్య, టీడీపీ

మిగతా 4వ పేజీలో



కొత్తపట్నం సచివాలయంలో దరఖాస్తు చేసేందుకు వచ్చిన మహిళతో మాట్లాడుతున్న డీఎస్‌వో పద్మశ్రీ (ఫైల్)

ఎనీటైం కార్డు

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూసిన అర్హులైన పేదలకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఇప్పటికే సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం వచ్చింది. అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైస్‌కార్డుల కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో రైస్ కార్డును అందించే విధంగా చర్యలు తీసుకుంది. కార్డుల్లో చేర్పులు, మార్పులకూ అవకాశం ఇచ్చింది.

రేషన్ దరఖాస్తులకు ఎలాంటి గడువు లేదు

- ఎప్పుడైనా చేసుకొనే అవకాశం
- ధ్రువీకరణ పత్రాల పేరుతో తిరస్కరణకు చెల్లుచీటీ
- త్వరలో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు
- చేర్పుల కోసం భారీగా దరఖాస్తులు

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఒకటిన్నర సంవత్సరం తర్వాత ప్రభుత్వం రైస్ (రేషన్) కార్డులు ఇచ్చేందుకు అవకాశం కల్పించింది. ప్రారంభంలో దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ సరిగా పనిచేయని కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. మరోవైపు సచివాలయ సిబ్బంది కొత్త కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు కొన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు కావాలని గట్టిగా చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అయితే నూతన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వీటన్నింటినీ పరిగణనలోకి

మిగతా 4వ పేజీలో

పాపం పసివాడు!

- ఏడుస్తూ మూడ్రోజులుగా జీజీహెచ్‌లో మూడేళ్ల బాలుడు
- మార్చురీలో తల్లి మృతదేహం
- ఆర్థిక భారం అంటూ వదిలేసిన తండ్రి
- దహన సంస్కారాలు నోచుకోక రిమ్స్‌కు భౌతికకాయం
- పలువురి సహకారంతో శిశుగృహానికి చిన్నారి



శిశుగృహానికి బాలుడిని అప్పగిస్తున్న దృశ్యం

5



కౌన్సెలింగ్ కోసం వచ్చి ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూల్ వద్ద రాత్రి వేళ పడిగాపులు కాస్తున్న టీచర్లు

టీచర్ల బదిలీలకు 6,797 దరఖాస్తులు

- 4,092 మందికి తప్పనిసరి మార్పు
- ముఖంచాటేసిన 93 మంది

ఒంగోలు విద్య, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు 6,797 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుకు మంగళవారంతో గడువు ముగిసింది. ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్ల దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూలు అసిస్టెంట్ల దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. వీరికి సంబంధించిన ప్రాథమిక సీనియారిటీ జాబితాలు కూడా విడుదలయ్యాయి. బదిలీలకు హైస్కూల్ గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు 141 మంది, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు 149 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 3,531 మంది, స్కూల్

మిగతా 4వ పేజీలో

అయ్యోర్లకు అగచాట్లు!

- హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల్లో అధికారుల తికమక
- బుధవారం కౌన్సెలింగ్ అంటూ తొలుత సమాచారం
- అప్పటికప్పుడు ఆపసోపాలు పడుతూ వచ్చిన ఉపాధ్యాయులు
- రాత్రి 8 వరకూ పడిగాపులు
- గురువారానికి వాయిదా వేసినట్లు డీఈవో ప్రకటన
- ఉసూరుమంటూ వెనక్కి

5

ముందస్తు బెయిల్ కోసం ముప్పా యత్నం

- వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులకు ముగిసిన పోలీసు కస్టడీ
- అమ్మనబ్రోలులో సోదాలు నిర్వహించిన పోలీసులు

ఒంగోలు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసులో సూత్రధారి ముప్పా సురేష్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అదేసమయంలో పోలీసు బృందాలు సురేష్‌ను పట్టుకునేందుకు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే వీరయ్య హత్య కేసు నిందితుల్లో తొమ్మిది మంది రిమాండ్‌లో ఉండగా ఈనెల 25న పోలీసు కస్టడీకి తీసుకొని నాలుగు రోజులపాటు విచారించారు. వారిని బుధవారం తిరిగి కోర్టులో అప్పగించగా ఒంగోలు జైలుకు పంపించారు. ఈ నేపథ్యంలో

మిగతా 4వ పేజీలో



గుండ్లకమ్మ వద్ద యోగా సాధనలో ప్రజలు (ఫైల్)

10 లక్షల మందితో యోగాడే

వచ్చేనెల 21న జిల్లాలో ఊరూరా నిర్వహణకు యంత్రాంగం కసరత్తు

- సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక యాప్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభం
- 31 వరకూ టీవోటీలకు.. అనంతరం వారి ద్వారా అందరికీ శిక్షణ
- నాలుగు పర్యాటక ప్రదేశాల్లో వారానికి ఒకచోట అవగాహన కార్యక్రమం
- ఇప్పటికే గుండ్లకమ్మ వద్ద పూర్తి
- వచ్చేనెల 18న ఒంగోలులో ఐదువేల మందితో యోగాసనాలు

ఒంగోలు మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వచ్చేనెల 21న తలపెట్టిన ప్రపంచ యోగా దినోత్సవాన్ని భారీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఆ రోజున జిల్లావ్యాప్తంగా ఊరూవాడా పెద్దసంఖ్యలో ప్రజానీకం యోగాసనాలు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా దీనిపై ప్రత్యేక దృష్టిసారించగా మొత్తం పది లక్షల మంది యోగా దినోత్సవం రోజున ఆసనాలలో పాల్గొనేలా లక్ష్యం నిర్దేశించుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా

మిగతా 4వ పేజీలో

రామతీర్థంకు చేరుకున్న సాగర్ జలాలు

- 950 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో
- ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 79 మీటర్లు

వివరాలు 4వ పేజీలో



జలాశయంలోకి ప్రవహిస్తున్న సాగర్ జలాలు



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు బొకే ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలులో డీజీపీ

విజయవాడ నుంచి కడప వెళుతూ మార్గమధ్యలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఒంగోలులోని పోలీస్ అతిథిగృహంలో కొద్దిసేపు సేదతీరారు. మహానాడు భద్రతా చర్యలను పర్యవేక్షించేందుకు కడప బయల్దేరిన డీజీపీ మధ్యలో జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఆయన వెంట ఇంటెలిజెన్స్ అదనపు డీజీపీ మహేష్ చంద్ర లడ్హా, శాంతిభద్రతల అదనపు డీజీపీ ఎన్.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. ఎస్పీ దామోదర్ వారికి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు అడ్డగింత

- వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం నేతల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గృహాలకు స్మార్ట్ మీటర్లు బుధవారం ఒంగోలులోని భగత్‌సింగ్ కాలనీలో బిగించేందుకు ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. అదానీ కంపెనీకి చెందిన ప్రతినిధి విద్యుత్ సిబ్బందితో కలిసి భగత్‌సింగ్ కాలనీలో మూడు గృహాలకు తొలుత స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు ఉపక్రమించారు. అదేమిటని గృహ యజమాని గుంజి శ్రీను ప్రశ్నించారు. మీటర్లకు ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని వారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయం సీపీఎం నాయకులకు తెలియడంతో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు అక్కడకు చేరుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడం దుర్మార్గమన్నారు. ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

5



టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబునాయుడు మరోసారి ఎన్నికైన సందర్భంగా ఆయన్నుకలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నేతలు

రెండో రోజూ అదే జోష్

- పలు ప్రాంతాల నుంచి ఉత్సాహంగా మహానాడుకు టీడీపీ నాయకులు
- నేడు ముగింపు, కడప సమీపంలో సభ
- జిల్లా నుంచి భారీగా బయల్దేరిన శ్రేణులు

ఒంగోలు, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కడప సమీపంలో నిర్వహిస్తున్న మహానాడుకు రెండో రోజైన బుధవారం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉత్సాహంగా పార్టీ నాయకులు తరలి వెళ్లారు. తొలిరోజైన మంగళవారం అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, పట్టణాల నుంచి ముఖ్యమైన నాయకులు వెళ్లారు. అలా వందలాది వాహనాల్లో వెళ్లిన వారిలో కొందరు అక్కడే ఉండగా మరికొందరు రాత్రికి తిరిగి వచ్చారు. అదేసమయంలో రెండో రోజు జిల్లాలోని వివిధ ప్రాంతాల

మిగతా 4వ పేజీలో

పసుపు జాతర


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం





రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు




మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

రామతీర్థంకు చేరుకున్న సాగర్ జలాలు

● 950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

చీమకుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వరప్రదాయిని రామతీర్థం జలాశయానికి సాగర్ జలాలు బుధవారం చేరుకున్నాయి. జిల్లావాసుల తాగునీటి అవసరాలు తీర్చే నిమిత్తం నాగార్జున సాగర్ నుంచి విడుదల చేసిన జలాలు ఓబీసీ ద్వారా రామతీర్థంకు చేరుకుంటున్నాయి. దాదాపు 950 క్యూసెక్కుల మేర జలాలు ఇన్‌ఫ్లోగా జలాశయంలోకి వస్తున్నాయి. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 79 మీటర్ల మేర ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 85.34 మీటర్లకు జలాశయం చేరుకోవాలంటే ఇదేరీతిన ఇన్‌ఫ్లో పదిరోజులకు పైగా సరఫరా కావాల్సి ఉంది. జలాశయం నీటిమట్టం 82 మీటర్లకు చేరుకున్న తర్వాత దిగువకు తాగునీటి అవసరాలు తీర్చే నిమిత్తం విడుదల చేయనున్నారు. ఒంగోలు, చీమకుర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపటానికి జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. కాగా సరఫరా అవుతున్న జలాలు కేవలం తాగునీటి అవసరాల మేరకు ఉపయోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముందస్తు బెయిల్ కోసం ముప్పా యత్నం

(3వ పేజీ తరువాయి)

మంగళవారం పోలీసులు అమ్మనబ్రోలులోని నిందితుడు సిద్దాంతి సాంబశివరావు, సూత్రధారి ముప్పా సురేష్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్న సురేష్ ఒక టీవీ చానల్‌కు ఫోన్ ఇన్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం బెయిల్ పిటిషన్‌పై విచారణ జరగనుంది. సురేష్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును అభ్యర్థిస్తూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన్ను పోలీసులు పట్టుకుంటారా? లేక కోర్టులో అతనికి ఊరట లభిస్తుందా? అనేది చర్చనీయాంశమైంది.

పోలీసుల అదుపులో ఇరువురు నిందితులు

వీరయ్య చౌదరిని అత్యంత దారుణంగా హత్య చేసిన కిరాయి హంతకుడు నాగరాజు, కిరాయి హంతకులను నెల్లూరులో మాట్లాడి ఒంగోలు పంపిన నానీలను పోలీసులు అదుపులోకి తీసుకొని గోప్యంగా విచారిస్తున్నట్లు తెలిసింది. గతనెల 22వ తేదీ రాత్రి వీరయ్య చౌదరిని హత్య చేసిన నలుగురు నిందితులలో నాగరాజు, మరొకరు కలిసి స్ప్లెండర్ ప్లస్ మోటార్ సైకిల్‌పై మంగమూరువైపు వెళ్లారు. బైక్‌లో పెట్రోలు అయిపోవడంతో దాన్ని రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. అక్కడి నుంచి ఓ ట్రాలీ ఆటోలో కొండపి వైపు ప్రయాణించినట్లు తెలిసింది. ఆటోలో సిమెంట్ బస్తాలు ఉండటంతో మార్గమధ్యంలో గమ్యస్థానంలో వాటిని దించి, అక్కడి నుంచి వారు అదే ఆటోలో జాతీయ రహదారికి చేరేందుకు బాడుగ మాట్లాడుకున్నారు. ఆటోడ్రైవర్ వారి మాటలు విని భయపడి మార్గమధ్యంలోనే దించి వేసి వెనుతిరిగాడు. మరలా బస్సులో ప్రయాణం చేసి నాగరాజు హైదరాబాద్ వెళ్లినట్లు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది.

రెండో రోజూ అదే జోష్

(3వ పేజీ తరువాయి)

నుంచి మరికొందరు మహానాడుకు వెళ్లారు. పార్టీశ్రేణులు ఊహించిన దానికన్నా బాగా మహానాడు జరుగుతున్నట్లు తెలుస్తుండటంతో జిల్లాలోని పలుప్రాంతాల నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. జిల్లాకుచెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, పార్లమెంట్ అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ లాంటి వారు కడపలోనే బసచేసి రెండవరోజు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సభల నిర్వహణలో అధిష్టానం తరఫున ఏర్పాట్లలో క్రియాశీలకంగా ఉన్న యువనేత దామచర్ల సత్య కొండపి నియోజకవర్గం నుంచి దాదాపు 50మందిని పిలిపించుకొని భోజన, వసతి సౌకర్యాల ఏర్పాట్లలో నిమగ్నమై పనిచేస్తున్నారు. కాగా మహానాడు గురువారంతో ముగియనుంది. ముగింపు సందర్భంగా భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నారు. ఆ సభకు జిల్లా నుంచి కూడా పెద్దసంఖ్యలో పార్టీ కార్యకర్తలు వెళ్ళనున్నారు. ప్రధానంగా పశ్చిమప్రాంత నియోజకవర్గాల నుంచి అధికంగా కదులుతున్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఆయా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు నేతృత్వంలో బస్సులు, ఇతర వాహనలను కూడా ఏర్పాటుచేశారు. ఇదిలాఉండగా మహానాడుకు వెళ్లిన జిల్లా నేతలు విరాళాలను కూడా అధిష్టానానికి అందజేస్తున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తొలిరోజున రూ.25లక్షల చెక్కును అందజేయగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఏకంగా కోటిన్నర రూపాయాల విరాళాన్ని ప్రకటించారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్‌సాగర్‌లు రూ.5లక్షలు అందజేశారు. మరికొంతమంది అలా ఇచ్చినట్లు సమాచారం.

ఎనీ టైం కార్డు

(3వ పేజీ తరువాయి)

తీసుకొని ఆధార్ కార్డు కలిగి ఉంటే చాలు రైస్‌కార్డుకు దరఖాస్తు చేసుకునే విధంగా అవకాశం కల్పించింది. కార్డులో పేర్లు తొలగింపుల కోసం మాత్రం అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంది. పేరు తొలగింపు కోసం వచ్చే దరఖాస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా రేషన్ కార్డులో పేరు యాడ్ (నమోదు) చేసుకునే విధంగా చర్యలు తీసుకుంది. రేషన్ కార్డు కోసం దరఖాస్తులకు ఎలాంటి గడువు విధించకుండా ఎప్పుడైనా చేసుకొనే అవకాశం కల్పించింది.

త్వరలో స్మార్ట్ కార్డు

ప్రస్తుతం ఉన్న రైస్ కార్డులో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్‌కార్డును ఇచ్చేందుకు నూతన ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ తీసుకునే అవకాశం కల్పించింది. జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్ షాపుల పరిధిలో 6,70,571 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటి స్థానంలో లబ్ధిదారులకు ఈ స్మార్ట్‌కార్డులను త్వరలో ఇవ్వనుంది. అందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంది. ఈ స్మార్ట్‌కార్డు ద్వారా రేషన్ పంపిణీ చేయడం వలన అక్రమాలకు కూడా అడ్డుకట్ట వేయవచ్చన్నది ప్రభుత్వ భావన.

పేరు యాడింగ్ కోసం 34,766 దరఖాస్తులు

ప్రభుత్వం కొత్త రైస్‌కార్డులతోపాటు పేర్ల చేర్పునకు కూడా అవకాశం కల్పించింది. అందుకోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 47,119 దరఖాస్తులు అందగా అందులో 34,766 యాడింగ్ కోసం వచ్చినవే ఉన్నాయి. కొత్త రైస్‌కార్డుల కోసం 5,690 దరఖాస్తులు వచ్చాయి. అడ్రస్ మార్పు కోసం 1,467, ఆధార్ సీడింగ్ కోసం 605, కార్డులో పేరు తొలగింపు కోసం 827, కార్డును అప్పగించేందుకు 19 దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం ఇంకా అవకాశం కల్పించడంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది.

దరఖాస్తుల స్వీకరణను పరిశీలించిన డీఎస్‌వో

రైస్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్జీదారులను ధ్రువీకరణ పత్రాలు కావాలని సచివాలయ సిబ్బంది వెనక్కు పంపుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో డీఎస్‌వో పద్మశ్రీ సచివాలయాలను సందర్శిస్తున్నారు. ఇటీవల కొత్తపట్నం సచివాలయానికి వెళ్లిన ఆమె.. అక్కడ కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. సచివాలయాల్లో రైస్ కార్డుల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

10లక్షల మందితో యోగాడే

(3వ పేజీ తరువాయి)

ఆసక్తి ఉన్న వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉండే సచివాలయ సిబ్బందికి ఈ బాధ్యత అప్పగించారు. మరోవైపు ఆసక్తి కనబరిచిన వారిని యోగాసనాలకు సన్నద్ధం చేసేందుకు మండల స్థాయిలో ట్రైనర్స్‌ను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తున్నారు. ఈ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది.

ఇంటింటికీ సచివాలయ సిబ్బంది

సచివాలయ సిబ్బందిని ఇంటింటికీ వెళ్లి యోగా ప్రాధాన్యతను వివరించి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. రెండు రోజుల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా జిల్లాలో 30వేల మంది చేయించుకున్నట్లు సమాచారం. మరోవైపు యోగాడే నిర్వహణపై విభిన్నవర్గాల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం వచ్చేనెల 21లోపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఒక్కోరోజు మెగా యోగా అవగాహన కార్యక్రమాల ఏర్పాటుకు నిర్ణయించింది. అందులోభాగంగా ఒంగోలులో వచ్చేనెల 18న రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమం జరగనుంది. సుమారు ఐదువేల మందితో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

(3వ పేజీ తరువాయి)

నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్ నేతృత్వంలో పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో జయంతి కార్యక్రమాలు జరిగాయి. మరోవైపు టీడీపీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు కడపలో జరుగుతున్న పార్టీ మహానాడుకు హాజరు కాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు ఈ వేడుకలను నిర్వహించారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ కామేపల్లి సీతారామయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఎర్రగొండపాలెంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించాయి. అలాగే పలు పట్టణాలు, వందలాది గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను తెలుగు తమ్ముళ్లు ఉత్సాహంగా నిర్వహించారు. తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతిక అయిన ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

టీచర్ల బదిలీలకు 6,797 దరఖాస్తులు

(3వ పేజీ తరువాయి)

అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు 1,696 మంది, స్కూల్ అసిస్టెంట్ గణితం, పీఎస్, బీఎస్, సోషల్, పీడీలు 1,233 మంది, పీఈటీలు 32 మంది, మ్యూజిక్ టీచర్ ఒకటి, తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం భాషా పండితులు 14 మంది కలిపి మొత్తం 6,797 మంది దరఖాస్తు చేసుకున్నారు.

4,092 మంది తప్పనిసరి బదిలీ

జిల్లాలో దరఖాస్తు చేసిన వారిలో 4,092 మంది తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంది. వీరిలో ఒకే పాఠశాలలో 8 సంవత్సరాలు, ఐదేళ్లు పూర్తయిన టీచర్లు ఉన్నారు. తప్పనిసరి బదిలీల్లో గ్రేడ్ -2 హెచ్‌ఎంలు 14 మంది, పీఎస్ హెచ్‌ఎంలు 27 మంది, ఎస్‌జీటీలు 2,438 మంది, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఇంగ్లీషు 954 మంది, గణితం, పీఎస్, బీఎస్, సోషల్ స్టడీస్ 626 మంది, పీఈటీలు 12 మంది, మ్యూజిక్ టీచర్ ఒకరు, తెలుగు, హిందీ, సంస్కృతం భాషా పండితులు 10 మంది ఉన్నారు. అభ్యర్థన మేరకు బదిలీ కోసం 2,705 మంది దరఖాస్తు చేశారు.

దరఖాస్తు చేయని 93 మంది

పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం తప్పనిసరిగా బదిలీ కావాల్సిన 999మంది దరఖాస్తు చేసుకోగా జిల్లాలో 93మంది తప్పించుకున్నారు. నిబంధనల ప్రకారం ఒక పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు పూర్తయిన వారు టీచర్ల పునర్విభజనకు గురైన వారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. అయితే జిల్లాలో 93మంది బదిలీకి దరఖాస్తు చేయకుండా ముఖం చాటేశారు. వీరిని బదిలీల ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన వాటిలో 4వ కేటగిరీ స్థానాల్లో నియమిస్తారు.

పాపం పసివాడు



బాలుడితో చైల్డ్‌లైన్ ప్రతినిధి సాగర్

బోసి నవ్వులు నవ్వుతూ.. గోరుముద్దలు తింటూ.. లాలిపాటలు వింటూ.. బుడిబుడి అడుగులు వేస్తూ.. అమ్మఒడిలో హాయిగా గడపాల్సిన నాలుగేళ్ల పసివాడు ఒంటరిగా మిగిలిపోయాడు. తన తల్లి కన్నుమూసిందనే విషయం కూడా తెలియని ఆ బాలుడు మార్చురీ వద్ద దీనంగా ఉండిపోయాడు. నిస్సహాయంగా నిలుచుని ఏడుస్తూ ఉన్న ఆ బాలుడి వివరాలు తెలుసుకున్న అక్కడివాళ్ల హృదయం ద్రవించింది. మూడు రోజులుగా మార్చురీ వద్దే ఆకలితో 'అమ్మా.. అమ్మా..' అని విలపిస్తూ ఉండటం పలువురుని కంటతడి పెట్టించింది. ఈ హృదయవిదారక ఘటన ఒంగోలులోని జీజీహెచ్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. చివరికి కొందరి సహాయంతో ఆ పసిబిడ్డ శిశు గృహానికి చేరాడు.

ఆకలితో ఏడుస్తూ మూడ్రోజులుగా జీజీహెచ్‌లో నాలుగేళ్ల బాలుడు

- మార్చురీలో తల్లి మృతదేహం
- ఆర్థిక భారమంటూ వదిలేసిన తండ్రి
- దహన సంస్కారాలు నోచుకోక రిమ్స్‌కు భౌతికకాయం
- ఒంటరిగా మిగిలిన బాలుడు
- పలువురి సహకారంతో శిశు గృహానికి చేరిక

ఒంగోలు, కార్పొరేషన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొత్తపట్నంలోని పల్లెపాలేనికి చెందిన పొన్నం పోలయ్య, భార్య దుర్గమ్మ దంపతులకు చందు అనే నాలుగేళ్ల కొడుకు ఉన్నాడు. ఆ కుటుంబం వీధుల్లో కాగితాలు ఏరుకుని వాటిని అమ్ముకుని జీవనం సాగిస్తోంది. కొంతకాలంగా దుర్గమ్మకు ఆరోగ్యం బాగా లేదు. పల్లెపాలేనికి చెందిన ఆశ వర్కర్ రత్నకుమారి దుర్గమ్మకు అవసరమైన మందులు అందిస్తూ ఉండేది. ఆమె పరిస్థితి క్షీణించడంతో రత్నకుమారి తానే స్వయంగా జీజీహెచ్‌లో ఈనెల 24న చేర్చారు. పరిస్థితి విషమించి దుర్గమ్మ కన్నుమూసింది. భౌతికకాయన్ని మార్చురీకి తరలించారు. అయితే మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో కొడుకు (చందు) మార్చురీ బయట ఒంటరిగా ఏడుస్తూ ఉన్నాడు. అమ్మ వస్తుందని ఆశతో గంటల తరబడి అక్కడే ఉండిపోయాడు. అక్కడున్నవారు విచారించగా బాలుడి తల్లి మరణించిందని, చిన్నారి వంటరిగా మిగిలాడని తెలిసి చలించిపోయారు.

● ఆర్థిక భారంతో వదిలేసిన తండ్రి

కొత్తపట్నం పల్లెపాలెంకు చెందిన పోలయ్య, దుర్గమ్మలకు శాశ్వత నివాసం లేదు. కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే వారికి ఊరూరా తిరుగుతూ ఉండటంతో భార్య అనారోగ్యంతో ఉన్నప్పటికీ కుటుంబ ఆర్థిక భారాన్ని మోయలేక వెళ్లిపోయాడు. ఆయన భార్య మరణించిన విషయం తెలుసుకున్న పల్లెపాలెం ఆశ వర్కర్ రత్నకుమారి... పోలయ్య కోసం విచారణ చేయగా, కావలిలో ఉన్నట్లు తెలుసుకుని సమాచారం అందించారు. ఒంగోలు చేరిన పోలయ్య, దహన సంస్కారాలు చేసే స్థోమత తనకు లేదని చెప్పడంతో ఆయన అంగీకారంతో దుర్గమ్మ పార్థివదేహాన్ని రిమ్స్ మెడికల్ అనాటమి కాలేజీకి రాసిచ్చారు. పిల్లోడిని కూడా చూసుకునే స్థోమత తనకు లేదని చెప్పడంతో మూడేళ్ల చందు ఒంటరిగా మిగిలిపోయాడు.



బాలుడిని అక్కున చేర్చుకున్న చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీ సభ్యులు, ఐసీడీఎస్ అధికారులు, హెల్ప్ ప్రతినిధులు, (సర్కిల్‌లో) బాలుడి తండ్రి పోలయ్య

స్వచ్ఛంద సంస్థ సహకారంతో శిశు గృహానికి..

చిన్నారి బాలుడు చందు దీన స్థితిని జీజీహెచ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.సాగర్ చొరవ చూపారు. బాలుడుని అక్కున చేర్చుకుని, జరిగిన విషయాలు తెలుసుకున్నారు. మూడేళ్ల బాలుడు దీన గాధను బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్‌కు వివరించారు. దీంతో వారిరువురు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.హెన్నా సుజన్, ఏఎన్ఎం యశోద, ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు పద్మావతి, జిల్లా కమిటీ సభ్యులు నీలిమ దృష్టికి తీసుకెళ్లడంతో చందు సంరక్షణ కోసం తండ్రి పోలయ్య అంగీకారంతో ఒంగోలులోని రామనగర్‌లోని శిశు గృహంలో చేర్పించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మార్కాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో నేరం రుజువుకావడంతో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ మార్కాపురం ఆరవ అదనపు న్యాయాధికారి ఎం.శు భవాణి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన పఠాన్ ఖాశింఖాన్ 2015 జూన్ 20వ తేదీన కోల్డ్ స్టోరేజీలో మిరపకాయులు చూసి వచ్చేందుకు గుంటూరు వెళ్లారు. తిరిగి 21వ తేదీన మార్కాపురం రైల్వేస్టేషన్ వద్ద దిగారు. సమీపంలోని రాయవరంలోగల షేక్ మహబూబ్‌పీరా టిఫిన్ బంకు వద్ద ఊరికి వెళ్లేందుకు నిల్చొని ఉన్నారు. ఖాశింఖాన్‌తో పొలం తగాదా ఉన్న గానుగపెంట గ్రామానికే చెందిన పఠాన్ సుభాని మరో ముగ్గురు రాయవరం గ్రామానికి చెందిన షేక్ బాషా, సయ్యద్ మాబుసుబాని, సయ్యద్ బడే హుసేన్‌తో కలిసి తలపై రాళ్లతో దాడిచేసి కొట్టి చంపారు. ఈ మేరకు మార్కాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో సాక్షులను విచారించిన న్యాయాధికారి మొదటి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. మరో ఇద్దరు నింది తులు కేసు విచారణ సమయంలోనే చనిపోయారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలునాయక్ వాదించారు.

మధుసూదన్‌కు అంతర్జాతీయ గుర్తింపు



తనపేరు నమోదైన పుస్తకాలను చూపుతున్న మధుసూదన్

మార్కాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలోని శ్రీసాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్‌కు ప్రత్యేకమైన అంతర్జాతీయస్థాయి గుర్తింపు లభించింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులను గుర్తించి వాళ్ల గురించి బయోగ్రాఫికల్ బుక్స్ ప్రచురించే ఢీల్లీకి చెందిన రిఫిసిమెంటో ఇంటర్నేషనల్ వాళ్లు ఆసియా ఖండంలో ప్రముఖ విజేతలను 1980 నుంచి ప్రత్యేక సంచికల్లో ప్రకటిస్తున్నారు. మధుసూదన్ విద్యా, సాహిత్య, పరిశోధక, సాంస్కృతిక రంగాల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా వారి 13వ సంచికలో ప్రచురించారు. ఆయన తండ్రి గుడ్లూరులో గ్రంథపాలకునిగా, చారిత్రాక పరిశోధకునిగా, అంతర్జాతీయ పర్యాటకులకు సమాచారవేత్తగా అందించిన సేవలకు గుర్తింపుగా కప్పగంతులు వేణుగోపాలకృష్ణమూర్తి గురించి కూడా 1989లో వారి 3వ ఎడిషన్‌లో ప్రచురించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు పురప్రముఖులు, సాహితీవేత్తలు, రచయితలు ఆయన్ని అభినందించారు.

1 నుంచి రేషన్‌షాపుల్లోనే సరుకుల పంపిణీ

● కలెక్టర్ అన్సారియా



రేషన్ షాపులో ఆయిల్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల్లో లబ్ధిదారులకు జూన్ 1 నుంచి రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. అందుకు అనుగుణంగా జిల్లాలో రేషన్‌షాపుల వెరిఫికేషన్, ఆన్‌లైన్ ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో రేషన్ షాపును బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా అక్కడ ఉన్న బియ్యం, అయిల్ ప్యాకేట్లను పరిశీలించారు. అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలించి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ షాపు పరిధిలో ఎంత మంది కార్డుదారులు ఉన్నారు? ఎంత రేషన్ సరఫరా తదితర అంశాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రేషన్‌షాపుల వెరిఫికేషన్, ఆన్‌లైన్ ప్రక్రియను ఈనెలాఖరులోపు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్‌వో పద్మశ్రీని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఒంగోలు తహసీల్దార్ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు రుతక్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక రిమ్స్‌లోని జిల్లా బాల భవిత కేంద్రం వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎ.తిరుపతిరెడ్డి ఉన్నారు.

అయ్యోర్లకు అగచాట్లు!

హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల్లో అధికారుల తికమక

- బుధవారం కౌన్సెలింగ్ అంటూ తొలుత ఆదేశం
- అప్పటికప్పుడు ఆపసోపాలు పడుతూ వచ్చిన ఉపాధ్యాయులు
- రాత్రి 8 గంటల వరకూ పడిగాపులు
- గురువారానికి వాయిదా వేసినట్లు డీఈవో ప్రకటన
- ఉసూరుమంటూ వెనుదిరిగిన టీచర్లు



రాత్రి 8 గంటలు సమయంలోనూ కౌన్సెలింగ్ కోసం టీచర్ల పడిగాపులు

ఒంగోలు (విద్య) మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతల ప్రక్రియ మొత్తం గజిబిజి గందరగోళంగా మారింది. జిల్లా అధికారుల అనాలోచిత నిర్ణయంతో అయ్యోర్లు స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూల్లో చిమ్మచీకట్లో పడిగాపులు పడాల్సి వచ్చింది. పాఠశాల విద్యా కమిషనర్ ప్రకటించిన షెడ్యూల్‌ను అధికారులు బేఖాతరు చేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఈనెల 30న జరగాల్సిన హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల ప్రక్రియను రెండు రోజులు ముందుగా బుధవారం రాత్రి చేపట్టడంతో హెచ్‌ఎంల సినియారిటీ జాబితాలోని స్కూల్ అసిస్టెంట్‌లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా నలుమూలల నుంచి వందల కిలోమీటర్లు ప్రయాణించి తీవ్ర వ్యయప్రయాసలకు లోనయ్యారు. చివరికి గురువారానికి వాయిదా వేయడంతో ఉసూరుమంటూ తిరుగుబాట పట్టారు.

కమిషనర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రధానోపాధ్యాయుల బదిలీల సీనియారిటీ జాబితా ఈనెల 27 ప్రకటించాల్సి ఉండగా ఆ జాబితా 28వ తేదీ రాత్రి 8 గంటలకు కూడా అతీగతి లేదు. ప్రధానోపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు ఈనెల30న విడుదల చేయాల్సి ఉంది. అదేరోజు హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంది. బుధవారం నిర్వహించిన అపెక్స్ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రానికి హెచ్‌ఎం బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తున్నామని, వెంటనే పదోన్నతల ప్రక్రియను చేపట్టాలని ఆర్జేడీ, డీఈవోలను ఆదేశించారు. బుధవారం వీలుకాని వారు గురువారం హెచ్‌ఎంల కౌన్సెలింగ్ నిర్వహించుకోవచ్చని చెప్పారు. అయితే బుధవారమే కౌన్సెలింగ్ నిర్వహించాలని డీఈవో, ఆర్జేడీ నిర్ణయించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో సమాచారం పంపారు. బుధవారం సాయంత్రం హెచ్‌ఎంల పదోన్నతల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాలోని అందరూ హాజరుకావాలని అందులో ఆదేశించారు. ఆ జాబితాలోని ఉపాధ్యాయులు ఆఘమేఘాలపై బయలుదేరి ఒంగోలు చేరుకుని పడిగాపులు కాశారు. రాత్రి 8 గంటల వరకూ చీకట్లోనే వేచిచూశారు. ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాపై చెప్పిన అభ్యంతరాలను పరిష్కరించకుండా ప్రమోషన్ కౌన్సెలింగ్‌కు పూనుకోవడంపై మండిపడ్డారు. కౌన్సెలింగ్‌ను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు డీఈవో ప్రకటించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.

తెలుగు జాతికి వెలుగు ఎన్టీఆర్

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : దేశ స్థాయిలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో తెలుగువారికి ఒక గుర్తింపు తీసుకు రావడంలో మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు ఎన్టీ రామారావు ఎంతో కృషి చేశారని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. పరిపాలనలో అనేక సంస్కరణలు తెచ్చి మండల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన మహోన్నతమైన నాయకుడు అని కొనియాడారు. ఎన్టీఆర్ జయంతిని పురష్కరించుకొని బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు భాషకు, తెలుగు సాంస్కృతిక రంగానికి మంచి గుర్తింపు తేవడంతో పాటు పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, కిలో రెండు రూపాయాలకు బియ్యం వంటి ఎన్నో ఆయన నాయకత్వంలో విలువైన మైలురాళ్లుగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● అంతకు ముందు స్థానిక అద్దంకి బస్టాండు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య నివాళులు అర్పించారు.

వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో రోగి మృతి

● జీజీహెచ్‌లో రోగి కుటుంబసభ్యుల ఆందోళన

ఒంగోలు (కార్పొరేషన్), మే 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జీజీహెచ్‌లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టంగుటూరు మండలం మర్లపాడుకు చెందిన ఎం.పోలయ్య (34) హైబీపీతో బుధవారం జీజీహెచ్‌కు రాగా వైద్య పరీక్షలు చేసి ఆసుపత్రిలోని 3వ ఫ్లోర్‌ని 316 పురుషుల వార్డులో ఇన్‌పేషెంట్‌గా చేశారు. రోగి పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉండగా నిరంతర పర్యవేక్షణ చేయాలని డ్యూటీ నర్సులను డాక్టర్ ఆదేశించారు. కానీ వారు పట్టించుకోకపోవడంతో పోలయ్యకు సాయంత్రం 6 గంటల నుంచి బీపీ అధికమైంది. ఆయన కుటుంబసభ్యులు అక్కడే విధుల్లో ఉన్న డ్యూటీ డాక్టర్లకు సమాచారమిచ్చాయి. అయినా పట్టించుకోలేదు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పోలయ్య మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా అక్కడకు రాలేదు. ఆ సమయంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవిలతకు బాధ్యతలు చూడాలని సూపరింటెండెంట్ చెప్పినట్లు సమాచారం. అయితే సీఎస్ఆర్ఎంవో కూడా వార్డులోకి రాలేదు. రోగి మరణించినా అధికారుల్లో స్పందన లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇన్‌చార్జ్ ఆర్ఎంవో చెంచయ్య వార్డుకు వెళ్లి పరిశీలించారు. వన్‌టౌన్ సీఐ అక్కడకు చేరుకుని మృతుడి కుటుంబసభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. జీజీహెచ్ అధికారులు, నర్సుల నిర్లక్ష్యం కారణగా పోలయ్య మరణించాడని, తమకు న్యాయం చేయాలని వారు నిరసన తెలిపారు.



మృతిచెందిన పోలయ్య

వేధింపులతోనే నా భర్త ఆత్మహత్యాయత్నం

● సురేందర్‌రెడ్డి భార్య ఆరోపణ



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సురేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : లారీ కొనుగోలు విషయంలో నిత్యం మార్కాపురం సీఐ స్టేషన్‌కు పిలిచించి వేధించడం వల్లే తన భర్త సురేంద్రరెడ్డి పురుగుమందు తాగి ఆత్మహత్యం చేశారని గిద్దలూరుకు చెందిన సురేంద్రరెడ్డి భార్య విజయలక్ష్మి ఆరోపించారు. కుటుంబసభ్యులతో కలిసి బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మార్కాపురానికి చెందిన దేవిరెడ్డి సుబ్బారెడ్డి వద్ద తన భర్త సురేంద్రరెడ్డి లారీ కొనుగోలు చేశారని, రూ.1.50 లక్షలు అడ్వాన్స్ కూడా ఇవ్వడంతోపాటు కొంతకాలం ఈఎంఐలు కూడా చెల్లించారని అన్నారు. కలిసి రాకపోవడంతో లారీ ఓనర్ సుబ్బారెడ్డికి తాము చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాలని కోరితే మార్కాపురం సీఐ ద్వారా తన భర్తను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి దూషించారని ఆమె ఆరోపించారు. ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో తన భర్త పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియోతో పాటు సూసైడ్ లేటర్ రాశారన్నారు. తన భర్త తీసిన సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్ ఆధారంగా గిద్దలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. తమను మార్కాపురం సీఐ సుబ్బారావు నుంచి రక్షించాలని వేడుకున్నారు.



మహానాడులో మనోళ్లు!

కడప జిల్లాలో వైభవంగా నిర్వహిస్తున్న టీడీపీ మహానాడులో జిల్లాకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రెండో రోజు బుధవారం మహాసభ ప్రాంగణంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ముఖ్య నాయకులంతా ఒకేచోట ఆశీనులయ్యారు.


ఒంగోలులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


చెన్నకేశవ లేఅవుట్ పార్కులో..


త్రోవగుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పేదలపాలిట పెన్నిధి ఎన్టీఆర్

- ఘనంగా జయంతి వేడుకలు
- పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నిర్వహణ

ఒంగోలు(కార్పొరేషన్), మే 28: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు బుధవారం ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల పాలిట పెన్నిధిగా, అన్నగా.. బడగు, బలహీనవర్గాల కోసం పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకొచ్చిన గొప్ప ఆదర్శవంతమైన నాయకుడు అని చెప్పారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కమ్మసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, కొమ్మూరి రవిచంద్ర, తెలుగుయువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తిప్పరమల్లి రవితేజ, అంబూరి శ్రీనివాసరావు, కామరాజుగడ్డ కుసుమ కుమారి, టి.అనంతమ్మ, పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో

స్థానిక ప్రసన్నచెన్నకేశవస్వామి లేఅవుట్ పార్కులో ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నిడమనూరి నాగేశ్వరావు, కుర్రా భాస్కర్‌రావు, బాలిన రామసుబ్బారావు, గణపతి మాస్టర్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈ చంద్రయ్య, ఏసీపీ సుధాకర్, మేనేజర్ శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు

జీజీహెచ్‌లో..

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్ నామినేని కిరణ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంవో మాధవిలత, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వామాలో..

ఒంగోలు కలెక్టరేట్: ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పీడీ జోసెఫ్‌కుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్పీ నివాళి


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం: స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పోలీస్‌శాఖ తరుపున ఎస్పీ ఏఆర్.దామోదర్ పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి డీటీసీ సుశీల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంవీఐలు సురేంద్రప్రసాద్, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): త్రోవగుంటలో ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కొప్పోలులో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు, నాటక రచయిత నడిపినేని వెంకటసుబ్బారావు దంపతులను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వడ్లమూడి మునీంద్ర, బత్తినేని కృష్ణమూర్తి, పోతినేని వేణుబాబు, కాట్రగడ్డ నాగేశ్వరరావు, నడిపినేని భాస్కర్, కాట్రగడ్డ రఘుపతి, కోనంకి చిరంజీవి, ఈదర వంశీకృష్ణ, నూనే ఉదయకుమార్‌రెడ్డి, గోనుగుంట సుబ్బారావు, పారరమేష్, గద్దల శ్రావణ్, మాదాల ఓంకార్, మైనేని రాము, దొడ్డ చంద్రశేఖర్ పాల్గొన్నారు. గుడిమెళ్లపాడు, ముక్తినూతలపాడు గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఉలిచిలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్టు చైర్మన్ మండవ మురళీకృష్ణ, చుంచు శేషయ్య, చుంచు శింగయ్య, యర్రా అంజయ్య, నన్నపనేని వెంకటరావు, యర్రంనేని నరసింహారావు, చుంచు రామాంజనేయులు, యర్రంనేని వెంకటశేషయ్య, చుంచు లక్ష్మీనారాయణ, మన్నం హరిబాబు, చోడవరపు శ్రీను, కావూరి అశోక్, బోయిడి బాలకృష్ణ, ఆదియ్య పాల్గొన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌రావు, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఏవో శేషుబాబు, ఏఈ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. యరజర్లలో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ, తెలుగుయువత మండలాధ్యక్షుడు వలేటి రాంబాబు, కంకణాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..


నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు: తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన మహనేత ఎన్టీఆర్ అని మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్నమనేని సుబ్బారావు, దాసరి రమేష్, మార్నేని రాఘవరావు, చుంచు హరిబాబు, కరిచేటి రమేష్‌బాబు, గంట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీరామ్మూర్తి, చండీగ కోటేశ్వరరావు, కడియాల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్, ఈవోఆర్డీ కె.రఘుబాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెబ్బవరపు ప్రభాకర్‌రావు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నందిపాడులో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా జరిపారు. కార్యక్రమంలో మండవ లక్ష్మీనారాయణ, మారెళ్ల సురేంద్రబాబు, మన్నే శేషయ్య, కోడూరి లక్ష్మీనారాయణ, పొదిలి అంకమ్మరావు, రావి సుబ్బారావు, మండవ రామకృష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా మద్దిపాడులో విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలోను ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: ఎన్టీఆర్ జయంతి వేడుకలను చీమకుర్తి పట్టణంలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తదుపరి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరంపల్లి హనుమంతరరావు, పూనాటి వెంకట్రావు, మన్నం వెంకయ్య, రావిపాటి శ్రీనివాసరావు, ఉన్నం సుబ్బారావు, అవనిగడ్డ శేషారావు, ఎస్.ఆంజనేయులు, ఉప్పుతోళ్ల నారాయణ, మద్ది వెంకట్రావు, వైపీ.వీరయ్య, గోగినేని శ్రీనివాసరావు, మర్రి లక్ష్మీనారాయణ, మస్తాన్‌వలీ, మోహన్, ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


చీమకుర్తిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడు బస్టాండ్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలోను ఉద్యోగులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరి శ్రీను, సాధినేని శ్రీరామ్మూర్తి, మన్నం రంగనాయకమ్మ, మందాడి వెంకటేశ్వర్లు, బొడ్డు శంకర్, సాధినేని సుబ్బారావు, ఆంజనేయులు, పోలిశెట్టి, జనార్ధన్, మక్బూల్, జార్జి పాల్గొన్నారు. మైనంపాడులో బుధవారం రాత్రి ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల రంగయ్య, అవినాష్, రాము, నరసింహారావు, సుబ్బయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు. పి.తక్కెళ్లపాడులోను ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి.


మైనంపాడులో..

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: ఎన్టీఆర్ జయంతి వేడుకలను అమ్మనబ్రోలులోని కనపర్తి బస్టాండ్ కూడలిలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ఇంటూరి శ్రీనివాసరావు, రాజారావు, ఈదర వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దిరాలపాడులో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పెనుబోతు సునీల్, షేక్ ఖాజావలి, గుమ్మడి సురేష్, తాళ్లూరి కృష్ణమూర్తి, నెప్పల కృష్ణమూర్తి, తాళ్లూరి ఆంజనేయులు, నెప్పల శివకృష్ణ పాల్గొన్నారు. నాగులుప్పలపాడులో మారెళ్ల వెంకట శేషయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఉప్పుగుండూరు బస్టాండ్ వద్ద కాట్రగడ్డ చంద్రబాబు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

కొండపిలో..

కొండపి: ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. కొండపిలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ వేడుకలు జరిగాయి. కార్యక్రమాల్లో తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, టీడీపీ నాయకులు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, దామా మురళి, కోటా వెంకటేశ్వర్లు, అనుమాల ప్రసాద్. కొండపి మాజీ సర్పంచ్ వై.మల్లికార్జున, కొండపి పట్టణ టీడీపీ నాయకులు సోమయ్య, సుబ్బరామయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, డీటీ డేవిడ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు నువ్వుల శ్రీను, ప్రసాద్, నేతి కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కొప్పోలులో కళాకారుడు వెంకటసుబ్బారావు దంపతులను మేళతాళాలతో సత్కరిస్తున్న నాయకులు

పొన్నలూరులో...

టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు యుగపురుషుడని పొన్నలూరు మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డం మురళి, మండవ కృష్ణారావు, పల్లపోతు మాధవ, పల్లపోతు వెంకటరావు, నరాల గంగయ్య, నేలపాటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో సుజాత, డిప్యూటీ ఎంపీడీవో నాగేశ్వరరావు ఎంఈవోలు రవిచంద్రబాబు, హరిబాబు, ఏపీవో సుధాకర్, ఏపీఎం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుల్లారావు, సిబ్బంది పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలేటిపాడులో...

జరుగుమల్లి మండలం పాలేటిపాడులో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మక్కెన శ్రీనివాసులు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మంగపాటి ప్రశాంతి, సర్పంచ్ యెహాను, కార్యకర్తలు పాల్గొన్నారు.

టంగుటూరులో...


వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఎన్టీఆర్ జయంతిని టంగుటూరులో ఘనంగా నిర్వహించారు. టీడీపీ సేవాసమితి, రావూరి వినీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పురం సెంటర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లం జయంతిబాబు, చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, తెలుగు యువత నాయకుడు గౌతమ్ పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ : కందుకూరు రోడ్డు కూడలిలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద ఎంపీడీవో జయమణి, సిబ్బంది నివాళులర్పించారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో చోరీ

- రూ.7లక్షల విలువైన సొత్తు అపహరణ

కొండపి, మే 28 (ఆంధ్రజ్యోతి) : పెట్లూరు గ్రామంలో ఉన్న భీమేశ్వర స్వామి ఆలయం (శివాలయం)లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు స్వామివారికి అలంకరించి ఉన్న రూ.5లక్షల విలువ చేసే నాగాభరణం, పూజకు వినియోగించే వివిధ రకాల వస్తువులు, హుండీలోని నగదును అపహరించుకుని వెళ్లారు. గ్రామానికి సమీపంలోని పొలాల్లో ఈ ఆలయం ఉంటుంది. బుధవారం ఉదయం పొలాలకు వెళ్లిన గ్రామస్థులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.7లక్షల వరకూ ఉంటుందని వారు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

అంకమ్మతల్లి ఆలయంలో..

జరుగుమల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్ఎన్ కండ్రిగ (కొత్తపాలెం) గ్రామంలో ఉన్న అంకమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. హుండీని పగులగొట్టిన దొంగలు అందులో ఉన్న నగదుతోపాటు అమ్మవారి వెండి కిరీటాన్ని అపహరించారు. బుధవారం ఉదయం గుర్తించిన గ్రామస్థులు జరుగుమల్లి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.లక్ష వరకూ ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

గుండ్లకమ్మ కాలువలో పడి వృద్ధుడి మృతి

మద్దిపాడు, మే 28(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ కుడి కాలువలో పడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివరామయ్య కథనం మేరకు.. బసవన్నపాలెం రోడ్డు తూర్పు వైపున ఉన్న గుండ్లకమ్మ కాలువలో 70 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామన్నారు. బసవన్నపాలెం వీఆర్వో ద్వారా రిపోర్ట్ తీసుకొని కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఉప్పుగుండూరులోని కమ్మవారి కళ్యాణ మండపంలో ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, లయన్స్ క్లబ్ సహకారంతో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎన్టీఆర్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్, చంద్రబాబు, స్వర్ణ కిషోర్, శేషగిరి, చిన్నా, శ్రీనివాసరావు, మేనేజర్ ఆనంద్, రాము పాల్గొన్నారు.

జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేయాలి

- జలజీవన్‌మిషన్ నోడల్ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సస్యశ్యామలం చేసేందకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జలజీవన్‌మిషన్ కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారులు వాగేష్ తివారీ, డాక్టర్ దినేష్‌కుమార్ పరివాల్ సూచించారు. జలజీవన్‌మిషన్ కింద జిల్లాలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు బుధవారం ఒంగోలుకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలో జలజీవన్ మిషన్ అమలు తీరును వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఫారం పాండ్స్, సోక్ పిట్స్ తదితర నిర్మాణాలవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో జలశక్తికేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూగర్భజల డీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో జిల్లాలో 12 మండలాల్లోని 93 గ్రామాలను పరిమితికి మించి భూగర్భజలాలు వాడినట్లు గుర్తించామన్నారు. ఈక్రమంలో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు వల్ల భూగర్భనీటి మట్టం ఏడాదిలోనే సగటున మూడు మీటర్లు పెరిగిందన్నారు. దీనిపై వాగేష్ తివారీ స్పందిస్తూ క్షేత్రస్థాయి పరిశీలించేందుకు గురు, శుక్రవారాల్లో గొట్టిపడియ, ఇస్టేక్‌వెల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. భౌగోళిక పరిస్థితుల సమస్యలు ఎదురవుతున్నా వాటిని సవాలుగా తీసుకొని సాగు, తాగునీటి పరంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో డీపీవో వెంకటనాయుడు, డీఏవో శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి యోగా దోహదం : ఎస్పీ

ఒంగోలు క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి యోగా దోహదపడుతుందని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో పోలీసులతో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు నిత్యం విధినిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దాని నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఉత్తమైన మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగా దినచర్యగా మారాలని కోరారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు విజయకృష్ణ, నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒంగోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద..

ఒంగోలు(రూరల్): యోగాతో మంచి ఆరోగ్యం లభిస్తుందని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద వివేకానంద హఠయోగా కేంద్రం వారితో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వారు గ్రామాల్లో ప్రజలకు శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హజిరాబేగం, ఏవో శేషుబాబు, ఏఈ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.


యోగాసనాలు సాధన వేస్తున్న ఎస్పీ దామోదర్, పోలీసు సిబ్బంది

మద్దిపాడులో..

మద్దిపాడు: దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, దీంతో మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతుందని ఎంపీడీవో శ్రీనివాసప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్‌మోహన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'జడా'పై కేసు నమోదు

ఒంగోలు క్రైం,మే 28(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసం చేశారని అందిన ఫిర్యాదుపై జడా బాలనాగేంద్రపై ఒంగోలు తాలుకా పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వ్యాపారం తమకు రావాల్సిన కమీషన్‌ను అడిగితే ఆయన బెదిరిస్తున్నారని మండవారిపాలెంకు చెందిన మారెళ్ళ శ్రీధర్‌బాబు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

సీఎంకు మాగుంట అభినందన


సీఎం చంద్రబాబును అభినందిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి అభినందించారు. కడపలో జరుగుతున్న మహానాడు సభలో బుధవారం సీఎం చంద్రబాబును ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు. రెండోసారి పార్టీ జాతీయ అధ్యక్షుడుగా చంద్రబాబు ఎన్నిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాగా మహానాడులో పార్టీకి ఎంపీ మాగుంట రూ.1.50 కోట్లు విరాళం ప్రకటించారు.

రేషన్‌బియ్యం పంపిణీ పక్కాగా ఉండాలి : ఆర్డీవో

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రేషన్‌పంపిణీని జూన్ 1వతేదీ నుంచి రేషన్‌షాపుల ద్వారానే కార్డుదారులకు సక్రమంగా అందించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం సాయంత్రం రేషన్ షాపు డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు మొబైల్‌వాహనాల ద్వారా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ జరిగిందన్నారు. అయితే కార్డుదారులకు సకాలంలో రేషన్ అందించేందుకు ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుందని చెప్పారు. అందువల్ల డీలర్లు తమ పరిధిలోని కార్డుదారులకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను సక్రమంగా అందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు పాల్గొన్నారు.

104 ద్వారా మెరుగైన సేవలు అందించాలి


డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు బొకే అందజేస్తున్న ఆర్ఎం మహ్మద్‌కలీం

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): 104 వాహనాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ 104 రీజనల్ మేనేజర్ మహ్మద్‌కలీం బుధవారం ఒంగోలులో డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి బొకే అఅందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 104 నిర్వహణ సంస్థ ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వైద్య సేవలు అందించాలని చెప్పారు. వాహనాలను ఎల్లవేళలా సేవలకు సిద్ధంగా ఉండాలన్నారు. 104 వాహనంలో పనిచేసే సిబ్బంది అందరూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో 104 జిల్లా మేనేజర్ షేక్ జిలానీ, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు డి.కోటేశ్వరరావు, శ్రీకాంత్, ఆర్.సుబ్రహ్మణ్యం, షేక్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అహల్యాబాయి సేవలు చిరస్మరణీయం


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): మల్హా వంశపు మహారాణి, రాజమాత అహల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకొని ఒంగోలులో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాపూజీ కాంప్లెక్స్ వద్ద నుంచి ఏకేవీకే కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివన్నారాయణ ముందుగా అలాహ్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అహల్యాబాయి సేవలు చిరస్మరణీయమని చెప్పారు. తన పరిపాలనలో సామాజిక, సాంఘిక సంస్కరణలతో హిందూ మత సంరక్షణకు ఎంతో పాటుపడ్డారన్నారు. ధార్మికసంస్థల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, నాయకులు దండు శ్రీనివాసరావు, ధనిశెట్టి రాము, శివాజీయాదవ్, కన్వీనర్ జిల్లెలమూడి రమాదేవి, ఆషారావు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల్లోనే సరుకులు పంపిణీ చేయాలి

సింగరాయకొండ, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చేనెల 1 నుంచి రేషన్ కార్డుదారులకు సరుకులను చౌక ధరల దుకాణాల్లోనే అందజేయాలని తహసీల్దార్ రవి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ సరుకులు పంపిణీ చేయాలన్నారు. దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులను, నాయకులను పిలిచి ఒక పండుగ వాతావరణంలో పంపిణీని ప్రారంభించాలని తెలిపారు. డీటీ ముస్తాక్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు, మే 28(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు బస్టాండ్ వద్ద వాసవీక్లబ్ జిల్లా ప్రతినిధి జీఎల్‌ప్రసాద్‌రావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు వేమాశ్రీను బుధవారం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్, మహిళాక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

కొండపి, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు నియోజకవర్గం నుంచి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఒక్కో మండలం నుంచి దాదాపు 20 వరకు వాహనాలు ఏర్పాటు చేసుకున్నారు. కొండపి మండలం నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి ఆధ్వర్యంలో భారీగా పార్టీ కార్యకర్తలు మహానాడుకు తరలి వెళ్లారు. జరుగుమల్లి, పొన్నలూరు మండలాల నుంచి పార్టీ క్రియాశీల కార్యకర్తలు, గ్రామ అధ్యక్షులు, బూత్‌లెవల్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో వెళ్లారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లోని స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో బుధవారం మొబైల్ అండ్ వెబ్ అప్లికేషన్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. రాచర్ల మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఈ తరహా 360మంది పిల్లలను గుర్తించగా, అందులో కొంతమంది దివ్యాంగ పిల్లలు తమకు టూవీలర్, ఫోర్‌వీలర్ చైర్స్ కావాలని కోరారని, సంబంధిత అధికారుల ద్వారా వాటిని ఇప్పించినట్లు చెప్పారు. మిగిలిన పిల్లలకు కూడా విద్యాపరంగా వారికి ఏమి కావాలో అవి అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అందువల్ల మొబైల్ అప్లికేషన్ పూర్తి చేసే విధానంపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హేనసుజన్, బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, డీఆర్పీ నోడల్ అధికారి గిరధర్‌శర్మ, సార్ప్ సంస్థ ప్రతినిధి సునీల్‌కుమార్, సీడీపీవోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ పురోభివృద్ధికి సహకరించాలి


మద్దిపాడులో శాఖను ప్రారంభిస్తున్న అధికారులు

మద్దిపాడు, మే 28(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంక్ పురోభివృద్ధికి ఖాతాదారులు దోహదపడాలని డీజీఎం ఆర్‌కే.అగర్వాల్ కోరారు. బుధవారం మద్దిపాడులోని ఆధునీ కరించిన కెనరాబ్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీఎం రాఘవేంద్రరావు, మేనేజర్ శ్రీధర్‌బాబు, మండవ రంగారావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, నారిపెద్ది వరహాలచౌదరి, అబ్బూరి శేషగిరిరావు, బోయపాటి వెంకయ్య, అద్దేపల్లి దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: సంతనూతలపాడులో ఆధునీకరించిన కెనరాబ్యాంకును బుధవారం తిరుపతి సర్కిల్ జీఎం పాండురంగ మితంతయ్ ప్రారంభించారు. అనంతరం ఖాతాదారులతో మాట్లాడారు. బ్రాంచ్ మేనేజర్ ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏజీఎం రాఘవేందర్, డీజీఎం ఆర్‌కే.అగర్వాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి




ఎన్టీఆర్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న క్రిష్ణకిశోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు


ఎల్‌కోటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


పొదిలిలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాటూరి వారిపాలెం మాజీ సర్పంచ్ నారాయణరావు

మార్కాపురంలో.. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మార్కాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా జరిగాయి. స్థానిక దోర్నాల బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ కేక్ కత్తిరించి కార్యకర్తలు, అభిమానులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్ మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం అన్న ఎన్టీఆర్ చివరి శ్వాసవరకు పనిచేశారన్నారు. తెలుగుజాతి ఈ భూమిపై ఉన్నన్నినాళ్లూ ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాలి కొండయ్య, వక్కలగడ్డ సుధాకర్, పఠాన్ ఇబ్రహీంఖాన్, షేక్ మౌళాలి, సయ్యద్ గఫార్, హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని తర్లుపాడు, సీతానాగులవరంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తర్లుపాడు బస్టాండ్ సెంటర్‌లో, నాగులవరంలో అన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తర్లుపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్బయ్య, శ్రేణులు పాల్గొన్నారు.

పొదిలి : ఎన్టీఆర్ జయంతి వేడుకలను తహసీల్దార్ కార్యాలయంలో క్రిష్ణారెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కాటూరివారిపాలెంలో మాజీ సర్పంచ్ కాటూరి నారాయణరావు ఎన్టీఆర్, కాటూరి నారాయస్వామి విగ్రహాలకు పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్ద బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, జిల్లా ముస్లిం మైనారిటీ కార్యదర్శి షేక్ రసూల్ నివాళులర్పించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం మహానాడుకు తరలివెళ్లారు.

గిద్దలూరు టౌన్ : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముత్తుముల క్రిష్ణకిశోర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక స్వేచ్ఛ కల్పించిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మధుసూదన్, బైలడుగు బాలయ్య, రాయప్రోలు సుబ్బరాయశర్మ, పందీటి రజనీబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతిని కంభం, అర్ధవీడు మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండలం ఎల్‌కోట గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, ఒంగోలు పార్లమెంటు ముస్లిం మైనారిటీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి అతార్ షేక్ హుస్సేన్ (దాదా) ఆధ్వర్యంలో, కంభం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో వీరభద్రాచారి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు సయ్యద్ రఫి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన తరువాత కడపలో జరిగే మహానాడుకు తరలివెళ్లారు.

రాచర్ల (గిద్దలూరు) : రాచర్ల గ్రంథాలయంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు శ్రీధర్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాలను ఎగురవేసి ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్ర మంలో యోగానంద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : సంక్షేమ పథకాలతో పేదల హృదయాల్లో ఎన్టీఆర్ మహనీయుడి స్థానం పొందారని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మన్నె రవీంద్ర అన్నారు. ప్రధాన సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన నాయకులతో కలిసి మహానాడు సభకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు వడ్లమూడి లింగయ్య, షేక్ జిలానీ, వూట్ల సీతారామయ్య, మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, పోతిరెడ్డి రమణారెడ్డి, బాదరయ్య, వెంకటేశర్లు, మూర్తయ్య పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ రవీంద్ర

త్రిపురాంతకం మండల తహసీల్దారు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలేవసి నివాళులర్పించారు.

త్రిపురాంతకం గ్రామ సచివాలయంలో ఎన్టీఆర్‌కు ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామసుబ్బయ్య పాల్గొన్నారు.

పుల్లలచెరువు : ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


యోగా డేలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

యోగాతో రోగాలు మాయం

మార్కాపురం వన్‌టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : యోగాతో రోగాలు దూరం అవుతాయని, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఒత్తిడి తగ్గించుకోవటానికి యోగా దోహద పడుతుందన్నారు. అనంతరం యోగా శిక్షకులు వివిధ యోగాసనాలను నేర్పించారు. మున్సిపల్, ఐసీడీఎస్, మెప్మా, సచివాలయ, బాలుర ఉన్నత పాఠశాల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఉషారుగా యోగా దినోత్సవం

కంభం : ప్రతిరోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. బుధవారం కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి యోగా శిక్షణలో పాల్గొన్నారు. ప్రతి రోజు యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

మార్కాపురం వన్‌టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : చిన్ననాటి నుంచే విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని గ్రంథ సేవకురాలు కొల్లి విజయలక్ష్మి అన్నారు. శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం ఆమె మాట్లాడుతూ..చదువుతో పాటు మంచి నడవడిక అవసరం అన్నారు. విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథపాలకుడు శివారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బండలాగుడు పోటీలు

గిద్దలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముండ్లపాడులో గల అంకాలమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా జూన్ 1వ తేదీన 6 పళ్ల విభాగంలో వృషభాలతో బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 1వ బహుమతిగా రూ.30వేలు, 2వ బహుమతిగా రూ.25వేలు, 3వ బహుమతిగా రూ.20వేలు, 4వ బహుమతిగా రూ.15వేలు, 5వ బహుమతిగా రూ.10వేలు, 6వ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

పోలేరమ్మ గుడికి బీరువా బహూకరణ

గిద్దలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం గంగంపల్లె గ్రామంలో గల పోలేరమ్మ ఆలయానికి వాసవీ జాగృతి మిత్రమండలి క్లబ్ ఐసీసీ ఆఫీసర్ సూరె చెంచయ్య బీరువాను బహూకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధి జి.రంగస్వామి రెడ్డికి బీరువాను అందజేశారు. కార్యక్రమంలో అమ్మవారిశాల అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, క్లబ్ ప్రతినిధులు బాదం వెంకటేశ్వర్లు, శివపురం హరిక్రిష్ణ, రమేష్‌బాబు, బచ్చు సుబ్బారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

జడ్‌ఆర్‌యూసీసీ సభ్యునిగా మార్కాపురం వాసి


వెంకటనారాయణరెడ్డి

మార్కాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ రైల్వే జోనల్ జడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా పట్టణానికి చెందిన గాయం వెంకటనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు గుంటూరు డివిజన్ డీఆర్‌యూసీసీ సభ్యులుగా వెంకటనారాయణరెడ్డి పనిచేస్తున్నారు. మంగళవారం గుంటూరులోని డివిజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో డివిజన్‌లోని డీఆర్‌యూసీసీ సభ్యులు వెంకటనారాయణరెడ్డిని జడ్‌ఆర్‌యూసీసీ సభ్యునిగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికుల సమస్యలు, రైల్వే స్టేషన్‌లలో వసతుల కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకునేలా తాను పనిచేస్తానన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

నీటి కుంటలో పడి మృత్యువాతపడిన అఖిల్‌ను చూసేందుకు వచ్చి బాబాయ్ హఠాన్మరణం

ఎర్రగొండపాలెం రూరల్ మే 28 (ఆంధ్రజ్యోతి) : నీట కుంటలో ప్రమాదవశాత్తు జారిపడి వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఆలేటి అఖిల్ మంగళవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఇది తెలుసుకున్న అఖిల్ బాబాయ్ గడ్డ దానియేలు (45) హైదరాబాద్ నుంచి బుధవారం ఉదయం ఎర్రగొండపాలెం చేరుకున్నారు. మృత దేహాన్ని చూసి చలించి పోయి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని చూసేందుకు బంధువులతో ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ బంధువులతో మాట్లాడుతూ దానియేలు కుప్పకూలిపోయారు. బంధువులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వైద్యులు పరిక్షించి మృతి చెందినట్లు తెలిపారు. దానియేలు స్వగ్రామం పెద్దారవీడు మండలం చాట్లమడ గ్రామం కాగా హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని బంధువులు తెలిపారు. ఎస్ఐ చౌడయ్యను అడగ్గా తమకు ఎలాంటి సమాచారం ఫిర్యాదు అందలేదని తెలిపారు. కాగా అఖిల్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఆర్మీ జవాన్ అనుమానాస్పద మృతి


రవి మృతదేహం

కొమరోలు, మే 28 (ఆంధ్రజ్యోతి) : సెలవుపై వచ్చిన ఆర్మీ జవాన్ తెల్లవారేసరికి మంచంపై శవమై కన్పించిన ఘటన మండలంలోని తాటిచర్ల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొమరోలు మండలం తాటిచర్ల గ్రామానికి చెందిన గోదా రవి (41) 18 సంత్సరాలుగా ఆర్మీలో పని చేస్తున్నారు. వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఆయన రిటైర్డ్ కానున్నారు. ఈ నేపథ్యంలో రవి సోమవారం రాత్రి జయపూర్ నుంచి సొంతూరు వచ్చారు. రాత్రి భార్యాపిల్లలతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఆయన తెల్లవారి లేవకపోవడంతో కుటుంబ సభ్యులు చూసేసరికి ఆయన మృతిచెంది ఉన్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే రవి తల్లి గోదా రత్నమ్మ కుమారుడి మృతిపై అనుమానాలున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించి, అనంతరం బంధువులకు అప్పగించారు. రవికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాలి

మార్కాపురం రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దార్ చిరంజీవి రేషన్ డీలర్‌లకు సూంచించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో పట్టణ, మండల రేషన్ డీలర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ జూన్ 1 వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రతి రేషన్ షాపును తప్పనిసరిగా ప్రారంభించి ప్రజలకు సరుకులు అందజేయాలన్నారు. కాటా తూకంలో ఎటువంటి తేడాలు లేకుండా, సరుకు స్టాకు, ధరల వివరాలను సమగ్రంగా కార్డుదారులకు తెలిసేవిధంగా ఉంచాలని కోరారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదు రాకుండా వారికి రేషన్ పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అర్జున్‌రెడ్డి, గోడౌన్ డీటీ రామకృష్ణ, పట్టణ, మండల పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

31న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

తర్లుపాడు, మే 28 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడులోని నీలంపాటి లక్ష్మి అమ్మవారి తిరుణాళ్ల సందర్భంగా ఈనెల 31న రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు ప్రథమ బహుమతిగా రూ.60వేలు, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు, తృతీయ బహుమతిగా రూ.40వేలు, నాలుగో బహుమతిగా రూ.30వేలు, ఐదో బహుమతిగా రూ.20వేలు, ఆరో బహుమతిగా రూ.15వేలు, ఏడో బహుమతిగా రూ.10వేలు, ఎనిమిదో బహుమతిగా రూ.8 వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకు 9440791396, 9640408773 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

రైతులు భూసార పరీక్షలు చేయించాలి


భూసార పరీక్షపై అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసులు

మార్కాపురం రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పంటలను సాగు చేసే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు కోరారు. మండలంలోని భూపతిపల్లి గ్రామంలో బుధవారం రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంట దిగుబడులు అధికంగా పొందాలంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. రైతులు పంటలు సాగుచేసే భూమిలో మట్టిని సేకరించి ఆర్ఎస్‌కే సిబ్బందికి అందజేస్తే ఫలితాలను రైతులకు వివరించి ఆ భూములలో ఏ పంటలు వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలియజేస్తారని తెలిపారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలలో రాయితీపై జనుములు, జీలుగలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిఇఓ రమణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఉభయదాతలు నడుంబిగించాలి

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పామూరులో చారిత్రాత్మకమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదనవేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 5నుంచి 13వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఉభయదాతలు నడుంబిగించి విజయవంతంగా జరపాలని దేవస్థాన కార్యనిర్వాహక అధికారి శ్రీగిరిరాజు నరసింహాబాబు కోరారు. రెడ్డి, వెలమ, యాదవ ఆరేమరాశి, ఉభయదాతలతో బుధవారం సమావేశం నిర్వహించారు.

నేటి నుంచి కోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ఠ

ముండ్లమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపాడు గ్రామంలోని దళితవాడలో నూతనంగా ఈనెల 30వ తేదీన ప్రతిష్ఠించనున్న కోదండ రామాలయం మహోత్సవం సందర్భంగా బుధవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజా కార్యక్రమంతో మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు జరగనున్నాయి.

మహానాడుకు తరలిన శ్రేణులు


మహానాడు ప్రాంగణం వద్ద మార్కాపురం నాయకులు


పెద్దారవీడు మండలం నుంచి మహానాడుకు బయలుదేరిన శ్రేణులు

మార్కాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు బుధవారం మార్కాపురం నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బుధవారం ఉదయం మార్కాపురం పట్టణం, మండల పరిధిలోని కేడర్ ఎక్కువ సంఖ్యలో తరలి వెళ్లారు. పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, మాలపాటి వెంకటరెడ్డి పర్యవేక్షణలో పదుల సంఖ్యలో వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

తర్లుపాడు : మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కడపలో జరుగుతున్న మహానాడుకు బయలుదేరి వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, కంచెర్ల కాశయ్య, గుర్రపసాల నరసింహులు, పి.గోపినాథ్ చౌదరి, ఈర్ల వెంకటయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

గిద్దలూరు టౌన్ : తెలుగుదేశం పార్టీ మహానాడు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు గిద్దలూరు నియోజకవర్గం నుంచి శ్రేణులు భారీగా తరలివెళ్లనున్నారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మహానాడు సభకు రానున్న శ్రేణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం నుంచి గ్రామాలవారీగా బస్సులను ఏర్పాటు చేశారు. సుమారు 80 బస్సులు, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు సుమారు 60 కార్లలో తరలి వెళ్తున్నట్లు మైదుకూరు-పోరుమామిళ్ల మధ్య మహానాడుకు వచ్చే శ్రేణులకు ఎమ్మెల్యే భోజన వసతిని ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు : మహానాడు సదస్సుకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, టీడీపీ మండల నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, గజ్వేల్లి భాస్కర్, కుమార్ తదితరులు వాహనాల్లో తరలివెళ్లారు.

పెద్దారవీడు : మహానాడుకు పెద్దారవీడు నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, నాయకులు గుమ్మా గంగరాజు, మాజీ అధ్యక్షుడు శ్రీనివానివాస రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవి పాల్గొన్నారు.


బీఎంసీ కాలనీలో ఇళ్ల ముందు మట్టితో చదును చేస్తున్న కార్మికులు

గిరిజన కాలనీలో అభివృద్ధి పనులు

సొంత నిధులతో చేయిస్తున్న టీడీపీ నాయకుడు

పెద్దదోర్నాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భ్రమరాంబ చెంచు గిరిజన కాలనీలో బుధవారం అభివృద్ధి పనులు చేపట్టారు. చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్న ఐనేని నాగ మల్లికార్జున సొంత నిధులు రూ.50,000 వెచ్చించి చెంచు గిరిజనుల ఇళ్ల ముందు చదును పనులు చేయించారు. గిరిజనులకు ఆర్‌డీటీ సంస్థ ఉచితంగా గృహాలను నిర్మించింది. కాగా అంతర్గత రహదారులు ఎత్తుగా ఉండడం, మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందు పల్లంగా ఏర్పడి మురుగు నీరు చేరి అస్తవ్యస్తంగా మారింది. దీంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై నాగమల్లికార్జున స్పందించారు. చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన దొడ్డా రాజబాబు, కామేపల్లి కృష్ణమూర్తి, వడ్లమూడి శ్రీను, శివల సహకారంతో ఐనేని సొంత నిధులను వెచ్చించి గుంతలను మట్టితో నింపి చదును చేయించారు. దీంతో చెంచు గిరిజనులు నాగమల్లికార్జునకు కృతజ్ఞతలు తెలియ జేశారు.


నాగాభరణానికి పూజలు చేస్తున్న అర్చకులు

రామలింగేశ్వరునికి నాగాభరణ అలంకరణోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవనగర్‌లో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మరకత లింగానికి నాగాభరణోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గార్లెదిన్నెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పెంచికల కాశయ్య స్వామి వారికి నూతన నాగాభరణాలను సమర్పించారు. అర్చకులు పోచంభట్ల కిరణ్, ఓరుగంటి శివకుమార్ మంత్రోచ్చరణ మధ్య నాగాభరణాన్ని రామలింగేశ్వరునికి ధరింపజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణమూర్తి, కేశవ పాల్గొన్నారు.

30న రగ్బీ జట్ల ఎంపిక

మార్కాపురం వన్‌టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 31వ తేదీన జూనియర్ బాలబాలికల రగ్బీ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ గణేష్ బుధవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వారి పేర్లను పాఠశాల పీడీ జాహ్నవి వద్ద నమోదు చేసుకోవాలని, ఎంపికైన జట్లు జూన్‌లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

ఎర్రగొండపాలెం రూరల్ మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు రైతుల కార్డులను మంజూరు చేయాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గతంలో ఉన్న కౌలు రైతులకు కౌలు కార్డులను రెన్యువల్ చేయడంతో పాటు కొత్తవారిని గుర్తించి వారికి కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వచ్చే నెలలో ప్రభుత్వం రైతు సాయంగా అందించే పథకం వర్తించేలా చూడాలని అన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

నేడు మారెళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కట్

ముండ్లమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ చినఅంకబాబు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మారెళ్ల, జమ్మలమడక, మక్కెనవారిపాలేల్లో విద్యుత్ సరఫరా మూడు గంటల పాటు నిలిపి వేస్తున్నట్టు ఆయన చెప్పారు.

నేటి నుంచి కోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ఠ



ముస్తాబైన కోదండ రామాలయం

ముండ్లమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపాడు గ్రామంలోని దళితవాడలో నూతనంగా ఈనెల 30వ తేదీన ప్రతిష్ఠించనున్న కోదండ రామాలయం మహోత్సవం సందర్భంగా బుధవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజా కార్యక్రమంతో మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. దాదాపు రూ.10 లక్షల విరాళాలతో నిర్మించిన రామాలయం ప్రతిష్ఠకు నోచుకోనుంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు.

పామూరులో క్షుద్రపూజల కలకలం

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పామూరులో బుధవారం ఒక రియల్ ఎస్టేట్ కార్యాలయం ఎదుట క్షుద్రపూజలు చేశారంటూ కలకలం రేగింది. స్థానిక విరువూరు రోడ్‌లోని ఓ రియల్ ఎస్టేట్ ఆఫీస్ ఉంది. మంగళవారం రాత్రి అమావాస్య కావడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయం తలుపు వద్ద పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పాటు కోడిగుడ్డుతో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తలెత్తిన వివాదాలే క్షుద్రపూజలకు కారణాలై ఉంటాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వ్యాపార పరంగా తనను దెబ్బకొట్టేందుకే తన ప్రత్యర్థులు ఇలాంటి పనులకు వడికొట్టి ఉంటారని రసూల్ ఆరోపించారు.

పామూరులో కుక్కల బెడద

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలో వీధికుక్కల బెడద తీవ్రతరమైంది. తూర్పువీధికి చెందిన ఆరియారం రోహన్‌తేజా అనే విద్యార్థి బయటకు వెళ్లివస్తుండగా కుక్క వెనుక నుంచి వచ్చి కాలు తొడ భాగం వద్ద కరిచి గాయం చేసింది. వీధి కుక్కల ఏరివేత కార్యక్రమం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంచినీటి చెరువులకు సాగర్ నీరు

దర్శి ఎన్‌ఏపీ చెరువును యుద్ధప్రాతిపదికన నింపుతున్న అధికారులు

దర్శి, మే 28(ఆంధ్రజ్యోతి) : మంచి నీటి చెరువులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నీరు నింపుతున్నారు. 120 గ్రామాలకు తాగునీరు అందించే ఎన్‌ఏపీ చెరువుకు మోటార్ల ద్వారా పంపింగ్ చేసి చెరువుకు పంపుతున్నారు. ప్రస్తుతం 200 హెచ్‌పీ మోటార్లు రెండు, 100 హెచ్‌పీ మోటార్లు నాలుగు, 75 హెచ్‌పీ మోటార్లు మూడు, ఒక 50 హెచ్‌పీ మోటార్లను ఆడిస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌ఏపీ చెరువులో 1500 మిలియన్ లీటర్ల నీరు నిల్వ ఉంది. చెరువు పూర్తి సామర్థ్యం 2,547 మిలియన్ లీటర్లు ప్రస్తుతం ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా రోజుకు 800 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్ జరుగుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమాప్‌బాబు తెలిపారు. 15 రోజుల్లో చెరువుకు నిండుగా నీరు నింపుతామని చెప్పారు. నాలుగు రోజుల క్రితం మంచినీటి చెరువులకు నీరు నింపేందుకు సాగర్ జలాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. సాగర్ జలాలు ట్యాంపరింగ్ కాకుండా ఎన్‌ఎస్‌పీ అధికారులు నిరంతరం కాల్వలపై పర్యవేక్షిస్తున్నారు. మంచి నీటి చెరువులు పూర్తిగా నిండేవరకు నీరు ఎక్కడా దుర్వినియోగం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయటంతో ఇరు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.



మోటార్ల ద్వారా ఎన్‌ఏపీ చెరువుకు చేరుతున్న సాగర్ నీరు



అక్రమంగా వదులుతున్న చెరువునీరు

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పామూరులోని కొత్తచెరువులోని నీటిని కొందరు చేపల పెంపకం దారులు రాత్రిపూట తూము ద్వారా అక్రమంగా నీటిని బయటకు వదులుతున్నారు. పంచాయతీ చెరువులో చేపలు పెంచుతున్న కొందరు తొందరగా చేపలు పట్టేందుకు నీటిని వృథా చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంకా లీజు సమయం రెండు నెలలు ఉందని, వేసవిలో చెరువు నీరు వృథాగా వదిలితే భూగర్భ జలాలు అందక నీటి మోటార్లు మోరాయిస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు అక్రమంగా నీటిని వదులుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తూము ద్వారా అక్రమంగా వదులుతున్న చెరువు నీరు

మహానాడులో రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన డాక్టర్ లక్ష్మీ

దర్శి, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడుకు దర్శి నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నారు. మూడోరోజు జరిగే బహిరంగ సభకు అన్ని మండలాల నుంచి వాహనాల్లో తరలివెళ్లారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు రక్తదాన శిబిరం నిర్వాహణ బాధ్యతలు తీసుకున్నారు. రక్తదానం చేస్తున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు చేస్తున్నారు. అదేవిధంగా మహానాడులో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సంగా తిరుపతి రావు తదితరులు మహానాడు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

మహానాడుకు డాక్టర్ లక్ష్మి దంపతులు రూ.5లక్షలు విరాళం

మహానాడులో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు రూ.5లక్షల విరాళాన్ని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు అందజేశారు.

టీడీపీ మహానాడులో పామూరు నాయకులు

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు పామూరు, సీఎస్‌పురం మండలాల నుంచి పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా 2వ రోజు బుధవారం ప్రతినిధుల సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే ఉగ్రతోపాటు పలువురు నాయకులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఉప్పలపాటి హరిబాబు, ఆర్‌ఆర్ రఫి, ఎస్ సాంబయ్య, ముబినామౌలాలి, పిడుగు శ్రీను, షేక్ నాయబ్‌రసూల్, మెంటా నరసింహారావు, పావళి తిరుపతయ్య, పత్తు మస్తాన్, గుత్తి మహేష్, బండ్ల నారాయణ, వాయినేని రాఘవ, వై అస్లీం, షేక్ రజ్జబ్‌బాష ఉన్నారు.



పామూరు టీడీపీ యువ నాయకులతో ఎమ్మెల్యే ఉగ్ర



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, పిచ్చియ్య

తాళ్లూరు నుంచి

తాళ్లూరు, మే 28(ఆంధ్రజ్యోతి) : కడప మహానాడు కార్యక్రమంలో తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు రెండో రోజు వేడుకల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి వెంట మండల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను, సీనియర్ నేతలు బి.ఓబుల్‌రెడ్డి, షేక్ కాలేషావలి, జి.వేణుబాబు, పిన్నిక రమేష్, రాచకొండ వెంకట్రావు, కె.రామయ్య, కైపు రామకోటిరెడ్డి, విద్యాసాగర్, సూరిబాబు, నాగార్జునరెడ్డి, హనుమారెడ్డి, పేరిరెడ్డి, వి.సుబ్బారావు పాల్గొన్నారు.

ముండ్లమూరు నుంచి...

ముండ్లమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడుకు రెండో రోజైన బుధవారం మండలంలోని అన్ని గ్రామాల నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. మహానాడు ప్రాంగణంలో దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్‌లను కలుసుకున్నారు. తరలి వెళ్లిన వారిలో మండల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, కొక్కెర నాగరాజు, కంచుమాటి శ్రీనివాసరావు, నవులూరి చిన అంజయ్య, వరగాని పౌలు, బేతపూడి రామారావు, కూరపాటి నారాయణ స్వామి ఉన్నారు.

పూర్తిస్థాయిలో కమిటీ ఏర్పాటు చేయాలి

సీఎస్‌పురం(పామూరు) మే 28 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి అన్నిరకాల కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి శివారెడ్డి సూచించారు. బుధవారం సీఎస్‌పురం చేరుకొన్నారు. ఈ సందర్భంగా సీఎస్‌పురం బీజేపీ అధ్యక్షుడు ఇండ్ల వెంకట సత్యం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య, రామకృష్ణ, టీ రమణయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

అవీఇవీ

సీసీల పనితీరుపై ఏపీఎం అసంతృప్తి



మాట్లాడుతున్న ఏపీఎం విద్యాసాగర్

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ చేపడుతున్న పలు పథకాలపై చేపట్టిన సర్వేలలో సీసీల పనితీరుపై ఏపీఎం విద్యాసాగర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమైఖ్య సంఘం అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ అధ్యక్షతన బుధవారం గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ బాల్యవివాహాలు, బంగారు బాల్యం, వెట్టిచాకిరీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల, చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వం శక్తి పేరుతో 7993485111 వాట్సాప్ నెంబర్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు లక్ష్మీకాంత, కార్యదర్శి ఉమ్మడి పద్మ, సహాయకార్యదర్శి విజయ, కోశాధికారి షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

ప్రధాన కూడలిలో ఇరుక్కుపోయిన బస్సులు



ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సులు

కురిచేడు, మే 28 (ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రధాన కూడలిలో బుధవారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు ఆర్టీసీ బస్సులు ఒక దానికి మరొకటి తగిలి ఇరుక్కుపోయి ట్రాఫిక్ ఆగిపోయింది. ప్రధాన కూడలి ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ నిరంతరం ఆగుతోంది. గతంలో ఉన్న రోడ్డును వెడల్పు చేసినా మళ్లీ రోడ్డు కుంచించుకుపోయింది. రోడ్డు ఇరుకుగా మారడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. బుధవారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న బస్‌లు ఇరుకు రోడ్డులో ఇరుక్కుపోయి రెండు వైపులా కొద్దిసేపు ట్రాఫిక్ ఆగింది. రోడ్డు ఆక్రమణదారులను ఖాళీ చేయించి రోడ్డును వెడల్పు చేస్తే తప్ప ట్రాఫిక్ కష్టాలు తప్పవని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

పంట సాగు హక్కు పత్రాలు పొందాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు భూయజమానుల అంగీకారంతో పంట సాగు పత్రాలు పొందాలని తహసీల్దార్ కె.సంజీవరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ సాగుదారు పత్రం 11 నెలల కాలపరిమితని, తరువాత రెన్యువల్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. భూయజమానుల హక్కులకు భంగం కలుగకుండా కౌలు రైతులు ప్రభుత్వ పథకాలు పొందేలా చర్యలు చేపట్టిందన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఉభయదాతలు నడుంబిగించాలి



ఉభయదాతలతో మాట్లాడుతున్న ఈవో నరసింహబాబు

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పామూరులో చారిత్రాత్మకమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదనవేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 5నుంచి 13వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ఉభయదాతలు నడుంబిగించి విజయవంతంగా జరపాలని దేవస్థాన కార్యనిర్వహక అధికారి శ్రీగిరిరాజు నరసింహాబాబు కోరారు. స్థానిక దేవస్థానంలో రెడ్డి, వెలమ, యాదవ ఆరేమరాఠి, ఉభయదాతలతో బుధవారం సమావేశం నిర్వహించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ క్రమం తప్పకుండా యోగా ఆసనాలు చేయడం ద్వారా మానసిక రుగ్మతలు తగ్గి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ గద్దె ఏడుకొండలు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం యోగా ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పుండరీకాంక్షయ్య, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఇన్‌చార్జి డిప్యూటి ఎంపీడీవో జీవీ అరవిందారెడ్డి, ఈవోఆర్డీ కేఎల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీసీపల్లిలో...



ఆసనాలు నేర్పిస్తున్న డాక్టర్ గద్దె

పీసీపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి) : నిత్యం యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందని ఎంపీడీవో ప్రభాకరశర్మ చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన యోగా శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు, ఉద్యోగులు, ట్రైనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తాళ్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యులు మౌనిక తెలిపారు. ఆరోగ్యపరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బుధవారం పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. రుతుక్రమంలో తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, హెచ్‌ఈవో చంద్రశేఖర్‌బాబు, పీహెచ్‌ఎన్ ఎంపీ రమణమ్మ, హెచ్‌వీ సుశీల పాల్గొన్నారు.

యోగాంధ్రాకు దూరంగా రెవెన్యూ ఉద్యోగులు

తాళ్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిమండల కేంద్రంలో ఉద్యోగులకు యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ అన్ని శాఖ అధికారులు హాజరవుతుండగా రెవెన్యూ ఉద్యోగులు మాత్రం దూరంగా ఉంటున్నారు. ఎంపీడీవో హనుమంతరావు, మన్నేపల్లి హోమియో వైద్యురాలు శిరీషల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు యోగాపై శిక్షణ ఇస్తున్నారు. 5రోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగా తహసీల్దార్, మిగిలిన రెవెన్యూ అధికారులు హాజరుకావటం లేదు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



దర్శిలో కేక్ కట్ చేస్తున్న తెలుగు తమ్ముళ్లు



దొనకొండలో కేక్ కట్ చేస్తున్న నేతలు



ముండ్లమూరులో పాల్గొన్న నేతలు

దర్శిలో...

దర్శి, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ జయంతి వేడుకలను దర్శిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు యాదగిరి వాసు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు తదితరులు పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో ఎన్టీఆర్, దివంగత మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించా రు. అనంతరం నాయకులు మహనాడుకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తలారి కోటయ్య, నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, గుర్రం ప్రసాదు, పసుపులేటి దత్తు, జీసీ అనీల్, దాసరి ఏడుకొండలు, ఉల్లి బాబు పాల్గొన్నారు.

దొనకొండలో...

దొనకొండ, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకలను మండల టీడీపీ అధ్యక్షుడు మోడి అంజనేయులు, మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, పత్తి వెంకటేశ్వర్లు, మన్నెం గాలెయ్య, కొమ్మతోటి సుబ్బారావు, దుగ్గెంపూడి చెంచయ్య, షేక్ తోహిద్, నిమ్మకాయల సుబ్బారెడ్డి, బత్తుల బ్రహ్మయ్య, పోతిపోగు చెన్నయ్య, ఫణిదపు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరులో ఉన్న దివంగత ఎన్‌టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించగా, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సర్పంచ్ కూరపాటి నారాయణ స్వామి, మాజీ సర్పంచ్‌లు మేదరమెట్ల వెంకటరావు, బేతపూడి బ్రహ్మేశ్వరరావు, గుంటుపల్లి రంగ నాయకులు, మేదరమెట్ల వీరనారాయణ, మేదరమెట్ల సుబ్బారావు, సోమేపల్లి సుబ్బారావు, సుంకర రాఘవరెడ్డి, జిల్లెలమూడి చౌదరి, మోతుకూరి శంకరరావు, సర్పంచ్ జనమాల నాగేంద్రం, పిచ్చయ్య పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుజాతి ప్రజల ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ ప్రపంచానికి వెలుగెత్తి చాటారని ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మండల టీడీపీ యువనేత ఐ.శ్రీనివాసరెడ్డి చెప్పారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తాళ్లూరులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తూము శివనాగిరెడ్డి, నల్లపాటి సత్యం, జి.లక్ష్మీనారాయణ, కె.సుబ్బారెడ్డి, రామలక్ష్మయ్య, పి.రమణారెడ్డి, అన్వర్‌బాష, అనపర్తి సుబ్బారావు, నాదెండ్ల శ్రీను,వంగపల్లి నాగేశ్వరరావు, మారం వెంకటరెడ్డి, ఎఫ్రాయిమ్, చాట్ల డానీ, జట్టి చిన పోతురాజు, పాలెపోగు దాసు, తూము నాగేంద్రరెడ్డి, కోట రామిరెడ్డి, మహిళానేత ఎం.సుజాత, సోము శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి ఎంపీడీవో దారా హనుమంతరావు నేతృత్వంలో నివాళులు అర్పించారు.



పామూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలుగు తమ్ముళ్లు



తాళ్లూరు కార్యక్రమంలో నేతలు

పామూరులో...

పామూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పామూరులోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నేతలు సయ్యద్ అమీర్ బాబు, బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి, డోలా శేషు, షేక్ ఖాజారహంతుల్లా, హాజీగౌస్, పోకా వినోద్, సయ్యద్ ఖాదర్‌బాష, అబ్బూరిశేషయ్య, వంకదారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో...

పీసీపల్లి, మే 28(ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం, ఎన్టీఆర్ జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ప్రభాకరశర్మ, ఏపీడీ భాస్కరరావు, ఏపీవో జహంగీర్, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

కురిచేడులో...

కురిచేడు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిడతల నెమిలయ్య, నాయకులు కాట్రాజు నాగరాజు, గడ్డం బాలయ్య, మొఘల్ మస్తాన్ వలి, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, దాసరి ఏడుకొండలు, కమతం నాగిరెడ్డి, డిష్ వెంకటేశ్వర్లు, కాళ్ల వెంకటేశ్వర్లు, మేడం నాగేశ్వరరావు, గంధం కోటి, ఫౌంద్రి సుభాని, నక్కా నాగపెద్ది రాజు, మేరువ పెద్దిరెడ్డి, శివ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రత (అంచనా) 29-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	35	27
తెనాలి	34	27
నరసరావుపేట	35	26
బాపట్ల	34	28
రెంటచింతల	35	26
చీరాల	34	28

మహానాడులో మన నేతలు



మహానాడు వేదికపై మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



మహానాడులో వేదికపై సీఎం చంద్రబాబు మంత్రి అనగాని సమాలోచన



మహానాడు వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



మహానాడు వేదిక వద్ద ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



మహానాడు వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



చీరాల నాయకులతో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

మద్దతు.. మమ



- ధాన్యం క్వింటాకి రూ.69 పెంపు
- సాగుకు, వ్యయానికి పొంతన లేని ధర
- మొక్కుబడిగా పెంచడంపై రైతుల్లో అసంతృప్తి
- కందులకు రూ.550, పత్తికి రూ.589 పెంపుపై హర్షం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగుకు.. వ్యయానికి.. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరకు ఏ మాత్రం పొంతన లేదు. ధరలు పెరిగిన స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర పెంచకపోవడంపై రైతుల నుంచి తీవ్ర అసంతృప్తి (మిగతా 4వ పేజీలో)

విత్తనాలు, నారు వ్యయం తడిసిమోపెడవుతోంది. ఎరువులు.. పురుగు మందుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూలి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. డీజిల్ ధర తగ్గనంటోంది. ఈ ధరాభారంతో రైతుల సాగు వ్యయం ఏటికేడు పెరిగిపోతోంది. అయితే ధరలు.. వ్యయం పెరిగే స్థాయిలో మద్దతు ధర పెరగక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సారైనా మద్దతు ధర సాగు వ్యయానికి అనుగుణంగా ఉంటుందని ఆశించిన రైతులను నిరాశపరిచింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను ఖరారు చేసింది. అయితే గిట్టుబాటు ధర మాట ఎలా ఉన్నా మద్దతు ధర సాగు వ్యయం ఆధారంగా పెరుగుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. మొక్కుబడిగా మద్దతు ధర ను పెంచిందని రైతుల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయకుండా పాలకులు మోసగిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

టిక్కెట్ల బుకింగ్‌లో.. ఇక్కట్లు



- ఐఆర్‌సీటీసీ పోర్టల్, యాప్ తరచూ క్రాష్
- టిక్కెట్ల బుకింగ్‌కు సాంకేతికంగా సమస్యలు
- ప్రయాణికుల దోపిడీకి ఇతర యాప్‌లకు మేలు

గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్ ఇటీవల తరచుగా క్రాష్ అవుతున్నది. ఒక పట్టాన యూజర్లను లాగిన్ కానీయడం లేదు. ఒకవేళ లాగిన అయినా టిక్కెట్ల బుకింగ్ చేసేందుకు సాంకేతిక సమస్యలను సృష్టిస్తున్నది. జనరల్ టిక్కెట్ల బుకింగ్‌కే ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ సమయంలో చుక్కలు చూపిస్తున్నది. గతంలో ఎప్పుడూ ఇలాంటి సమస్య లేదని యూజర్లు వాపోతున్నారు. ప్రధానంగా మీ ఇం టర్నెట్ కనెక్టివిటీని చెక్ చేసుకోమంటూ ఎర్రర్ సం దేశం వస్తున్నది. మొబైల్ ఇంటర్నెట్, వైఫై, బ్రాడ్ బ్యాండ్ సేవలు బాగానే ఉన్నప్పటికీ ఇదే సమస్య ఉత్పన్నం అవుతున్నది.

గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా బుకింగ్‌లు

ఐఆర్‌సీటీసీ యాప్/వెబ్ పోర్టల్ రైల్వే టిక్కెట్ల బుకింగ్‌కు మొరాయిస్తుండటంతో యూజర్లు గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా అదనపు సర్వీసు చార్జీలు చెల్లించి టిక్కెట్లు బుకింగ్ చేసుకోవాల్సి వస్తోంది. ఇదే సమయంలో టిక్కెట్ చార్జీపై అదనంగా రూ.50 చెల్లిస్తే ఒకవేళ క్యాన్సిలేషన్ చేసుకున్నా ఫుల్ రీఫండ్ చేస్తామంటూ వల విసురుతున్నాయి. అదే ఏసీ టిక్కెట్లకు త్రీటైర్ అయితే రూ.127, సెకండ్ ఏసీ అయితే సెకండ్ ఏసీకి రూ.177, ఫస్టు ఏసీకి రూ.295 చెల్లిస్తే త్రీటైర్ టిక్కెట్ క్యాన్సిల్ చేసుకున్నా పూర్తి రీఫండ్ చేస్తామంటున్నాయి. ఈ విధంగా ప్రయాణికులను దోపిడీ చేసేందుకు ఐఆర్‌సీటీసీ సంస్థ ఇతర యాప్‌లకు మేలు చేకూరుస్తున్నది అనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పొలపాడు రోడ్డులో నిర్మించిన పొలం చెరువు

నీటి కుంట.. ఉపాధికి తంటా

- మొక్కుబడిగా పొలం చెరువుల నిర్మాణం
- లక్ష్యం 12,000.. నిర్మించింది 1,513
- రైతులను చైతన్య పరచడంలో అధికారుల విఫలం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం నడుం కట్టింది. విస్తృతంగా పొలం చెరువులు (నీటి కుంటలు) నిర్మించాలని సంకల్పించింది. ఈ మేరకు జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. ఈ నెలాఖరుకు కుంటల పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రైతులకు అవగాహన కల్పించి పొలం చెరువుల నిర్మాణంలో జిల్లాల యంత్రాంగం చతికిలపడింది. రుతుపవనాల ప్రభావంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నీటి కుంటల నిర్మాణం ముందుకు సాగే పరిస్థితులు కానరావడంలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి కుంటలను పొలాల్లో పెద్ద ఎత్తున చేపట్టారు గత ఐదేళ్ల ఈ పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం రాగానే కుంటల నిర్మాణం చేపట్టాలని తిరిగి నిర్ణయించింది. వాటిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడితే, గ్రామాల్లోని (మిగతా 4వ పేజీలో)

కదిలేదే లేదు



- ఏడీ పోస్టు కోసం 'పూనం' ఉత్తర్వులు రద్దు చేయించిన ఏవో
- గుంటూరు పోస్టు కోసం ఆరోపణలు ఉన్న అధికారి పాట్లు
- వైసీపీ నేపథ్యం ఉన్న వారికి సిఫార్సు లేఖలు
- వ్యవసాయ శాఖ బదిలీల్లో అంతా గందరగోళం

గుంటూరు సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఓ ఉద్యోగి ఒకే చోట ఎక్కువకాలం విధుల్లో ఉండ డానికి నిబంధనలు ఒప్పుకోవు. వ్యవసాయ శాఖలో మాత్రం ఆ సంప్రదాయం ఉన్నట్లు కనిపించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముఖ్య కార్యాలయాల్లో సుమారు 30 మంది అధికారులు పదిహేడేళ్ల నుంచి ఓడీ (ఆన్ డ్యూటీ)లో పని చేస్తూ ఉన్నారు. అది కూడా ఉన్నత అధికారుల ఎరుకలో జరుగుతూ ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యవసాయశాఖలో అన్ని ముఖ్య విషయాలను ఓడీపై ఉన్న అధికా రులే చక్క పెడుతూ ఉండటం వివా దాస్పదమవుతున్నది. బదిలీపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిన తర్వాత ప్రధాన కార్యాల యాల్లో పాతుకు పోయి అవినీతి, అక్రమా లకు ఊతంగా ఉన్న కొందరు అధికా రుల వ్యవహారం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశమైంది. చాలామంది మహిళా అధికారులు సుమారు దశాబ్దం నుంచి వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. వారికి కూడా పోస్టింగ్‌లు దక్కకుండా ఓడీపై కొనసాగుతున్న అధికారుల మాఫియా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు న్నాయి. గత ప్రభుత్వం టీడీపీకి అనుకూలంగా ఉండే అధికారులను జిల్లా కేంద్రం నుంచి సుదూర ప్రాంతాలకు బదిలీ చేసింది. ఇప్పుడు ఆ అధికారులు జిల్లా కేంద్రం దగరకు రావడానికి కూడా ఓడీ అధికారుల బృందం అడ్డుపుల్లలు వేస్తుంది.



సామాన్యులు కాదు..

గత ప్రభుత్వంలో వ్యవసాయశాఖలోని కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇదే సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఓ ఏవో చేసిన సాహసకార్యంపై చర్చ జరుగుతున్నది. ఆ మండల వ్యవసాయ అధికారి ఏడీఏగా కొనసాగేందుకు ఏకంగా అప్పటి వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులను రద్దు చేయించారు. అక్కడికి (మిగతా 4వ పేజీలో)

మహానాడులో నేతల విరాళాలు



గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప లో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతి నిధులు, నేతలు భారీ విరాళాలు ప్రకటించారు. బుధవా రం రెండో రోజు సభావేదిక వద్దే వారు విరాళాలను అధినేత చంద్రబాబుకు అంద జేశారు. గుంటూరుకు చెందిన భాష్యం రామకృష్ణ రూ.కోటి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లా రావు రూ.25 లక్షలు, టీడీపీ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే రూ.25 లక్షలు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రూ.10 లక్షలు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ రూ.10 లక్షలు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ రూ.10 లక్షలు చొప్పున విరాళాలు అందజేశారు.

నేడు స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

గుంటూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి గురువారం గ్రేడ్ 2 హెచ్ఎంలుగా ఉదోగోన్నతులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేసుకున్న వారు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని ఎంఈవోలు డిప్యూటీఈవోలు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లను ఉద్యోగోన్నతుల కోసం ప్రోత్సహించాలని డీఈవో సూచించారు.



తడి భూములను సంరక్షించాలి

- సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలి
- సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు

బాపట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): తడిభూముల సంరక్షణపై అధికారులు బాధ్యత వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ జలవనరులను సంరక్షిస్తేనే తడిభూమిని భద్రంగా ఉంచగలమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను విధిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. తడిభూములను వాణిజ్య అవసరాలకు వినియోగించరాదన్నారు. ఆ ప్రాంతాల్లో చెత్తవేయడం, వ్యర్థాలు కుప్పగా వేయరాదన్నారు. సముద్రతీర ప్రాంతాల్లోని తడిభూములలో మడ అడవులను వృద్ధి చేయాలన్నారు.సమావేశంలో అటవీశాఖాధికారి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ఎన్టీఆర్ జీవితం దర్పణం

ఎన్టీఆర్ జయంతిలో ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు, పట్టుదలకు ఎన్టీఆర్ జీవితం దర్పణం పడుతుందని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నటుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రజల మనుస్సులను గెలుచుకున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సీఐ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

కోవర్టులపై కన్నెర్ర

- మహానాడు వేదికగా చంద్రబాబు హెచ్చరిక
- ప్రత్యర్థులతో చేతులు కలిపితే వదిలిపెట్టమని ఆగ్రహం
- 'కూటమిలోకి కోవర్టులు' కథనంతో కలకలం

గుంటూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో జరిగిన జంట హత్యలతో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. హత్యకు గురైన వారే కాకుండా హత్య చేసిన వారు కూడా టీడీపీ వారేనని తొలుత పల్నాడు పోలీసు అధికారులు ప్రచారం చేయడంతో టీడీపీలో ఇటువంటి పరిణామాలు ఏమిటని పార్టీ అధిష్ఠానం నివ్వెరపోయింది. అయితే ఆ తర్వాత హత్య చేసిన వారు ఇటీవలే టీడీపీలో చేరిన వారని, వారిని ప్రోత్సహించి వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులే హత్యలు చేయించారని వెల్లడైంది. దీంతో ఆ సోదరులిద్దరిపై



కూడా కేసు నమోదు చేశారు. దీంతో టీడీపీ ముఖ్య నేతల్లో అంతర్మథనం మొదలైంది. వైసీపీ కోవర్టులు నేరుగా అవకాశం దొరికితే టీడీపీలో చేరుతున్నారు. లేదంటే జనసేన, బీజేపీ ముసుగులో కూటమి గొడుగు కిందకు చొరబడుతున్నారు. దూరంగా ఉండే శత్రువు పట్ల అప్రమత్తతగా ఉండగలం కానీ పక్కనే మిత్రుల రూపంలో ఉండే శత్రువు నుంచి ఎలా కాపాడుకోగలమని అసలు సిసలైన నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు. ఏ నిమిషాన ఎటువంటి విపత్తు కోవర్టుల నుంచి పొంచి వస్తుందోనని భయపడుతున్నారు. ఈ పరిస్థితిపై రెండు రోజుల క్రితం టీడీపీలోకి (మిగతా 4వ పేజీలో)

థియేటర్లలో అధికారుల తనిఖీలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆర్‌డీవోలు, తహసీల్దార్ల పర్యవేక్షణలో రెవెన్యూ, సివిల్ సప్లయిస్ డీటీలు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేశారు. ప్రధానంగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, ఆహార పదార్థాల విక్రయం, టిక్కెట్ ఛార్జీలు, లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ, సీటింగ్ కెపాసిటీ తదితరాలపై తనిఖీలు జరిగాయి. బాపట్లలోని చీరాల రోడ్డులో ఉన్న శ్రీనివాసమహల్, రైల్వే స్టేషన్ రోడ్డులోని విజయకృష్ణ థియేటర్లలో ఇన్‌చార్జి ఆర్డీవో లవన్న ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. శానిటేషన్‌పై మరింత శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జి ఆర్డీవో నిర్వాహకులకు సూచించారు.



బాపట్లలోని చీరాల రోడ్డులో థియేటర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

రుణాలు అందుతున్నాయా?

- డ్వాక్రా మహిళలను ప్రశ్నించిన కేంద్ర బృందం
- చందోలు, ఖాజీపాలెంలో పర్యటించిన సభ్యులు



ఉద్యానవనాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పిట్టలవానిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌ల ద్వారా డ్వాక్రా రుణాలు సమగ్రంగా అందుతున్నాయా.. లేదా అని మహిళలను కేంద్ర బృందంలోని సభ్యులు అనీల్‌కుమార్, అరుకుమార్ ప్రశ్నించారు. మండలంలోని చందోలు, ఖాజీపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డ్వాక్రా మహిళలు, పింఛన్‌దారులు, ఉపాధి కూలీలతో కేంద్ర బృందం సభ్యులు ప్రత్యేకంగా మాట్లాడారు. తొలుత చందోలులో హౌసింగ్ ద్వారా నిర్వహించే గృహాలను పరిశీలించారు. నూతనంగా నిర్మించే గోకులం షెడ్లను, ఉపాధిహామీ పథకం కింద నిర్మించి సీసీరోడ్లను కేంద్రబృందం పరిశీలించింది. చందోలు, ఖాజీపాలెం సచివాలయ పరిధిలోని ఎటికట్ల గ్రామం, కళాశాల పక్కన ఉద్యాన శాఖ ద్వారా రైతులు పండించే పంటలను పరిశీలించి, వారు పొందుతున్న లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..





పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు









నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

మద్దతు.. మమ

(5వ పేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నది. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.69 విదిల్చిందని రైతులు వాపోతున్నారు. ఎంతో కాలంగా ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదు. క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2300 నుంచి రూ.2369కి పెంచింది. కింటా ధాన్యం మద్దతు ధర రూ.500 నుంచి 600 వరకు పెంచి ఉంటే మేలు జరిగి ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు. కందులకు క్వింటాకు రూ.7550 నుంచి రూ.8000కు, పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7121 నుంచి రూ.7710కి పెరిగింది. మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.2225 నుంచి 2400కి పెంచించారు. మొక్కజొన్న, పత్తి, కందికి కూడా ఇంకా మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. మినుములు క్వింటాకు రూ.400, జొన్నలు క్వింటాకు రూ.328 మద్దతు ధర పెరిగింది.

నీటి కుంట.. ఉపాధికి తంటా

(5వ పేజీ తరువాయి)

కూలీలకు ఉపాధి దొరకడంతో పాటు, రైతులకు నీటి వసతి ఉంటుందని భావించింది. అయితే పొలంలో చెరువు వల్ల పంటలకు కలిగే ప్రయోజనాలను వారికి వివరించి నిర్మాణానికి అంగీకరించేలా రైతులను చైతన్య పరచడంలో యంత్రాంగం విఫలమైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 12,000 పొలం చెరువులు నిర్మించాలని లక్ష్యం కాగా ఇప్పటికి 1,513 చెరువులను మాత్రమే నిర్మించారు. పనులు చేపట్టడంలో నెలకొన్న నిర్లక్ష్యం ఉపాధి కార్మికులకు శాపంగా మారింది. గ్రామంలోనే పనులు లభించే పరిస్థితికి వారు దూరమయ్యారు. చెరువుల నిర్మాణం అంతంతమాత్రంగా ఉండటంతో కార్మికుల ఉపాధికి గండిపడింది.పల్నాడు జిల్లాలో 6,500 నీటి కుంటలకు 4,528 నీటి కుంటలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వీటిలో 1,663 కుంటలకు 777 మాత్రమే అంటే 17.16 శాతం పూర్తి చేసినట్లు డ్వామా అధికారులు తెలిపారు. గుంటూరు జిల్లాలో 1,500 నీటి కుంటలు లక్ష్యం కాగా 776 మంజూరయ్యాయి. వీటిలో 100 అంటే 12.89 శాతం పనులు పూర్తయ్యాయి. బా పట్ల జిల్లాలో 4,000 సేద్యపు నీటి కుంటలకు 2,298 మంజూరు చేశారు. వీటిలో 636 అంటే 26.60 శాతం నిర్మించారు.

కదిలేదే లేదు

(5వ పేజీ తరువాయి)

ఒక ఏడీఏను నియమించినా జాయిన్ కాకుండా అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే మండల వ్యవసాయ అధికారి ఏడీఏగా కొనసాగుతూ ఉన్నారు. 17 ఏళ్ల నుంచి ఓడీపై కొనసాగుతున్న నిర్వాహకం తేటతెల్లమవుతోంది.

వైసీపీ నేపథ్యం ఉన్నా లేఖలు..

గుంటూరు ఏడీఏ పోస్టు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఓ అధికారికి గుంటూరు రూరల్ మండలంలోని వైసీపీ ముఖ్య నేతలతో బంధుత్వం కూడా ఉంది. అదే అధికారి గతంలో ఈ ప్రాంతంలో పనిచేసినప్పుడు అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. ఇప్పుడు అదే అధికారిని గుంటూరు ఏడీఏ నియమించాలని సిఫార్సు లేఖలు ఇవ్వడం వివాదాస్పదమైంది. పూర్తిగా వైసీపీ నేపథ్యం ఉన్న వారికి సిఫార్సు లేఖలు ఇవ్వడంపై వ్యవసాయ శాఖలోని పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుంటూరు జిల్లాకు చెందిన ఓ అధికారి టీడీపీకి అనుకూలమని ఆయన్ను బలవంతంగా తొలగించారు. ఆయన్ను అదే పోస్టులో కొనసాగించాలని ఓ సీనియర్ ఎమ్మెల్యే లేఖ ఇచ్చిన తర్వాత కూడా సుదూర ప్రాంతానికి పంపారు. కొందరు వ్యక్తులు అధికారుల విషయంలో ప్రజాప్రతినిధుల కార్యాలయాల్లోని సిబ్బందిని పక్కదారి పట్టించి ఇటువంటి బదిలీలకు శ్రీకారం చూడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

టోటల్‌గా కలెక్షన్...

అయితే ప్రస్తుతం వ్యవసాయ శాఖలో జరుతున్న బదిలీల ప్రక్రియపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఎన్ని సిఫార్సు లేఖలు ఉన్నా కొందరు అధికారులు కప్పం చెల్లించాల్సిందే అని ముఖం మీదే చెబుతున్నట్లు తెలుస్తుంది. అదేమంటే ఓ ముఖ్యమైన వ్యక్తిని లైన్‌లో పెట్టి మాట్లాడిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కోవర్టులపై కన్నెర్ర

(5వ పేజీ తరువాయి)

కోవర్టులు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనం రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించింది. మాచర్ల జంట హత్యల ఉదంతంతో కోవర్టుల తీరును గమనించిన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడపలో మహానాడు వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పార్టీలో కొంతమంది ప్రత్యర్థులతో చేతులు కలిపి మనమధ్య కోవర్టులుగా ఉంటున్నారు.. వైసీపీ నేతల ప్రోత్సాహంతో హత్యా రాజకీయాలు చేస్తున్నారు.. ఇలాంటి తప్పుడు పనులు చేసే ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టను.. గుడ్డిగా ఇక ఎవరినీ నమ్మం.. అంటూ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. దీంతో వైసీపీకి కోవర్టులుగా వ్యవహరిస్తున్న చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి నేతల వరకు వణికిపోతున్నారు.

నామినేటెడ్ పదవుల వైపు చూపు..

అధికారం వచ్చాక కొందరు.. అధికారం వస్తుందని ముందే గ్రహించి ఎన్నికలకు కొద్ది రోజుల ముందే కూటమి నీడకు వచ్చిన నేతల్లో కొందరు ఇప్పటికీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు, ఆయన అరాచక బ్యాచ్‌కు కోవర్టులుగా వ్యవహరిస్తున్నారు. వీళ్లైతే హత్యలు, లేకుంటే దాడులు చేస్తూ దానికి ఆధిపత్య పోరుగా రంగు పులుముతూ కోవర్టుల మనే విషయం బహిర్గతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీరిలో కొందరైతే నామినేటెడ్ పదవులపై కూడా కన్నేశారు. దీంతో పార్టీ కష్టకాలంలో వెన్నంటి ఉంటూ ఆర్థికంగా తోడ్పాటు అందించిన వారిని పక్కకునెట్టి పదవులు చేజిక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారు. తమలాగా పార్టీ కోసం పాటు పడిన వారిలో ఎవరికి పదవి దక్కినా సంతోషిస్తాం కానీ కోవర్టులకు పదవులు దక్కితే తాము తలెత్తుకొని ఎలా తిరగ్గలమని పార్టీ వీరాభిమానులు ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబు హెచ్చరికతో ఈ కోవర్టుల బెడద వీడుతుందేమో చూడాలి.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

● నివాళులు అర్పించిన రాజకీయ నేతలు, అధికారులు


బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

చీరాల , మే 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. టీడీపీ నేతల ఆధ్వర్యంలో పార్టీ క్యాంపు కార్యాలయం, బస్టాండ్, వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట ప్రాంతాల్లో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. తెలుగు జాతి సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం, నాదెండ్ల కోటేశ్వరరావు, శ్రీరాం రమేష్, తేలప్రోలు నాగేశ్వరరావు, గుమ్మ వెంకటేష్, ఆవుల అశోక్, తేజ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీవో ఆధ్వర్యంలో

చీరాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కారంచేడు(పర్చూరు): : కారంచేడులోని కాలువ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిఅర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అణు శాస్త్రవేత్తగా పుల్లాయిపాలెం వాసి


నక్కల సాంబశివరావు

గవినివారిపాలెం(చీరాల), మే 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం గవినివారి పాలెం పంచాయతీ పుల్లాయిపాలెంకు చెందిన నక్కల సాంబశివరావు ప్రభుత్వ బార్క్(బాబా అటమిక్ రీసెర్చ్ సెంటర్)కు అణు శాస్త్రవేత్తగా ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలయిన గేట్, సీటీటి పరీక్షల్లో దేశ వ్యాప్తంగా 289వ ర్యాంకు సాధించాడు. అంతేకాకుండా బార్క్ నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పాల్గొని సత్తా చాటి ఏ గ్రేడ్‌లో శాస్త్రవేత్తగా ప్రతిభ కనబరిచాడు. బాపట్లలో హైస్కూల్ స్థాయి, నాగార్జున సాగర్ ఆర్జేసీలో ఇంటర్, విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేశాడు. ఈక్రమంలో గ్రామానికి వన్నె తెచ్చిన సాంబశివరావును గ్రామస్థులు అభినందిస్తున్నారు.

కారును ఢీకొన్న స్కూటీ

● ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలు

యద్దనపూడి,(మార్టూరు)మే28(ఆంధ్రజ్యోతి): కారును స్కూటీ ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన బుధవారం మధ్యాహ్నం చిలకలూరిపేట,గుంటూరుల మధ్య జాతీయరహదారిపై బోయపాలెం వద్ద జరిగింది. అందిన సమాచారం మేరకు యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల హరిణి ఇంజనీరింగ్ చదువుతుండగా, ఆమె స్నేహితురాలు సౌమ్య ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నారు.ఇద్దరు యువతుల కుటుంబాలు చిలకలూరిపేట లో నివాసం ఉంటున్నారు.వారు స్కూటీ పై జాతీయ రహదారిపై గుంటూరు నుంచి చిలకలూరిపేటకు వస్తూ కారును ఢీ కొన్నారు.దాంతో వారిద్దకి తీవ్రగాయాలయ్యాయి. అనంతరం వారిని హైవే అంబులెన్స్‌లో గుంటూరు లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం వారిద్దరు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఇంకొల్లు, పర్చూరు రోడ్డు పనులకు భూమిపూజ

ఇంకొల్లు,మే 28,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు, పర్చూరు రహదారి నిర్మాణ పనులకు బుధవారం ఇంకొల్లులోని పర్చూరురోడ్డులో వైజంక్షన్ వద్ద భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో కూటమి ప్రభుత్వం ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు రోడ్డు అభివృద్ధి చేసేందుకు రూ.23.88 కోట్లు మంజూరు చేసింది.ఈ సందర్భంగా డీఈ నళిని మాట్లాడుతూ శరవేగంతో పనులు ప్రారంభించి త్వరతిగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.10 మీటర్ల వెడల్పుతో రోడ్డును విస్తరించి నిర్మాణం చేస్తామన్నారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలేరు రామకృష్ణ, కొల్లూరి శివాజీ, వెంకటకృష్ణ, బేతపూడి సురేష్ , అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి

మార్టూరు, మే28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ప్రతి ఇల్లు,వీధి పరిశుభ్రతగా ఉండాలంటే ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని మండల విస్తరణ అధికారి పి. రామాంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామ పంచాయతీ వద్ద స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం జరిగింది. సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, ముఖ్య అతిథిగా విచ్చేసిన విస్తరణ అధికారి రామాంజనేయులు మహిళలకు చెత్తవేసే బుట్టలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావు,సచివాలయ సిబ్బంది,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తీవ్ర గాయాలతో అపస్మారస్థితిలో ఉన్న తల్లీ కొడుకు

కారు ఢీకొని తల్లీ,కుమారుడికి తీవ్ర గాయాలు

అక్కయ్యపాలెం(చీరాల), మే 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళుతున్న తల్లీ కుమారుడిని వేగంగా కారు ఢీ కొంది. ఈ ఘటన బుధవారం రాత్రి చీరాల - వేటపాలెం మధ్య గల అక్కయ్యపాలెం జంక్షన్ 216 జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల శాంతినగర్‌కు చెందిన ఐనంపూడి రత్నకుమారి భర్త, కుమారుడు జ్యోయల్‌తో వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం కోళ్ల పెంపకం వద్ద ఉంటున్నారు. ద్విచక్ర వాహనంపై కుమారుడితో తల్లి చీరాల వైపుకు వస్తుండగా చీరాల నుంచి పని ముగించుకుని ఒంగోలుకు వెళుతున్న ఇన్నోవా కారు వీరిని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాల్లోకి ఎగిరి పొలాల్లో పడ్డారు. దీంతో తల్లికి కుడి కాలు తొంటి భాగం పూర్తిగా దెబ్బతింది. అలాగే కుమారుడికి కుడి కాలు, చేయి దెబ్బతిన్నాయి. స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఘటనపై వేటపాలెం పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు

ఉప్పుటూరు(పర్చూరు), మే 28 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం విడుదల చేసిన సాగర్ జలాలు చెరువులకు చేరుతున్నాయి. వనరుల్లో నీరు అడుగంటంతో ఎద్దడి వస్తుందని ప్రజలు ఒకింత ఆందోళన చెందారు. అయితే అలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టి సాగర్ నీటిని విడుదల చేసింది. దీంతో ఆ జలాలు చెరువులకు చేరుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు మండల నూతలపాడు మైనర్ ద్వారా 150 కూసెక్కుల పరిమాణంలో నీటి సరఫరా జరుగుతున్నదని నీటిపారుదలశాఖ ఏఈ సుబ్బారావు తెలిపారు.


ఉప్పుటూరు చెరువుకు చేరుతున్న సాగర్ నీరు

ఆంధ్రుల అభిమాన నటుడు నందమూరి

అద్దంకిటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల అభిమాననటుడు నందమూరి తారక రాముడని, తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దేశ ప్రజలకు చాటిన రాజకీయ నాయకుడని వక్తలు కొనియాడు. ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో బుధవారం సాయంత్రం ప్రతిభామూర్తులు-మధుర స్మృతులు సభ ఘట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా ఎన్టీఆర్‌కు నివాళి

మేదరమెట్ల: రావినూతలల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నేతలు నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, యువత జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మేదరమెట్ల, పమిడిపాడు, దైవాలరావూరు, తదితర గ్రామాలలో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రావినూతలలో అన్నదానం నిర్వహించారు.


రావినూతలలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న తెలుగుదేశం శ్రేణులు

అవీ.. ఇవీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేఈ భీమానాయక్

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మే 28(ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగించు కోవాలని చినగంజాం విద్యుత్ శాఖ జేఈ బీమానాయక్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం గద్దె పెదసుబ్బారావు అధ్యక్షతన బుధవారం డ్వాక్రా మహిళలకు పీఎం సూర్యఘర్ సోలార్ పథకంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఇంటిలో 2 కే.ఎం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలరూపాయిల నుంచి రూ.60 వేల రూపాయిల వరకు, 3 కేఎం ఏర్పాటు చేసుకుంటే రూ.75 వేల రూపాయిల వరకు సబ్సిడీ వస్తుందని తెలిపారు. దీని వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. పీఎం.సూర్య ఘర్ ఏర్పాటు చేసుకునేవారికి అవసరమైన రుణం బ్యాంకు ద్వారా గాని, శ్రీనిధి, సీఐఎఫ్, పొదుపు ద్వారా గాని ఇప్పిస్తామని ఏపీఎం తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రూపుల్లో ఉన్న ప్రతి సభ్యురాలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కె.వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



మండలంలోని భగవాన్‌రాజుపాలెంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు

బీఆర్‌పాలెంలో శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం

పంగులూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. 16వ జాతీయ రహదారి నుంచి గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయం వరకు 150 మీటర్ల పొడవున, 5.2 మీటర్ల వెడల్పుతో సీసీరోడ్డును విశాలంగా నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి చేరుకునే ఈ ప్రధాన రహదారి గోతులమయం కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితిని గుర్తించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సీసీరోడ్డు నిర్మాణానికి రూ. 10 లక్షల ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారు. దీంతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని శరవేగంగా చేయిస్తున్నారు. రహదారి నిర్మాణానికి సహకరించిన మంత్రి గొటట్టిపాటి రవికుమార్‌కు స్థానిక టీడీపీ నేతలు నార్నె సుబ్బారావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, పెద్దన్నలు కృతజ్ఞతలు తెలిపారు.



మహిళలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి

రుతుస్రావ సమస్యలను అధిగమించాలి

- జిల్లా వైద్యాధికారిణి విజయలక్ష్మి

కావూరివారిపాలెం(చీరాల), మే 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు రుతుస్రావ సమయంలో ఒత్తిడికి లోనవక సమస్యను అధిగమించాలని జిల్లా వైద్యాధికారిణి డా. విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కావూరివారి పాలెం పంచాయతీ ఆంధ్రకేసరినగర్‌లో గ్రామ వికాస్ పీస్ ఫౌండేషన్, సీబీఎన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచ రుతు పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమానికి డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సందేహాలను నివృత్తి చేశారు. మహిళలకు స్వచ్ఛంద సంస్థ సహాయంతో శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు.

విధుల్లో అలసత్వం తగదు

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించరాదని, నిర్దేశించిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో నివేశన స్థలాలు మంజూరు చేసేందుకు చేపట్టిన స్థల సేకరణపై ఆరా తీశారు. అలాగే రీ సర్వేపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదంచేయండి

వచ్చే నెలలో నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రజలు పాల్గొని విజయవంతంచేయాలని ఎంపీడీవో రాజేష్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ మాల్యాద్రి, టీడీపీ కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు

మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం ప్రదేశంలో అధికారులు నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం, ఈదురు గాలుల కారణంగా కొత్తపాలెంలో ఓ టిఫిన్ హోటల్‌పై విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఈక్రమంలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించారు.

31న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పంగులూరు, మే 28(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈ నెల 31వ తేదీన పంపిణీ చేస్తామని ఎంపీడీవో స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో 7,774 మంది లబ్ధిదారులకు రూ. 3,24,43,500ల మొత్తాన్ని శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గోకులాల బిల్లుల కోసం ఎదురు చూపులు

నిర్మాణం పూర్తయి నాలుగు మాసాలు

జరగని చెల్లింపులు

పశుపోషకుల ఆవేదన

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గోకులాల నిర్మాణాన్ని చేపట్టింది. ఇందుకు కోసం లబ్ధిదారులకు పెద్ద ఎత్తున రాయితీని కూడా ప్రకటించింది. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత సిబ్బంది పశుపోషకులకు అవగాహన కూడా కల్పించారు. పశువులకు సౌకర్యంగా ఉండటంతోపాటు, ప్రభుత్వ రాయితీ కూడా వస్తుందని ఆశతో ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా పశుపోషకులు పశుసంవర్థక శాఖ నుంచి అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేశారు. రెండు పశువులకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.2.30 లక్షలు చొప్పున ప్రభుత్వం ప్రకటించింది. అందులో 90శాతం ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పించింది. నిర్మాణం పూర్తి అయిన తరువాత ప్రభుత్వం బిల్లులు చెల్లించే విధంగా కార్యాచరణ కూడా రూపొందించింది. దీంతో పూర్తిచేసుకున్న వెంటనే బిల్లులు వస్తాయన్న ఆశతో పశుపోషకులు యద్ధప్రాతిపదికన నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. అయితే పనులు పూర్తిఅయి నాలుగు మాసాలు గడుస్తున్నా బిల్లులు అందకపోవటంతో పశుపోషకులు నైరాశ్యానికి గురవుతున్నారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న వెనువెంటనే బిల్లులు వస్తాయని అధికారులు చెప్పటంతో అప్పుచేసి మరీ మినీ గోకులాలను నిర్మించుకున్నామని పశుపోషకులు అంటున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకోవటంతో ఆర్థికభారం పెరిగి పోతుందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇప్పటికైనా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి నిధులు విడుదల అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు వేడుకుంటున్నారు.



అడుసుమల్లిలో పూర్తిచేసుకున్న మినీ గోకులం

అద్దంకి మెప్మాలో ఆర్పీ రుణ మోసం

మరో మహిళతో కలిసి బ్యాంకులో తీసుకున్న వైనం

సీవో విచారణ

తిరిగి చెల్లించేందుకు హామీ

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని మెప్మాలో పనిచేసే ఓ ఆర్పీ తాను సభ్యురాలుగా ఉన్న ఆదర్శ పొదుపు సంఘంలో సభ్యులకు తెలియకుండా బ్యాంక్ నుంచి అదనంగా రూ.4 లక్షల రూపాయల రుణం తీసుకోవడంపై ఆందోళన రేగింది. వివరాలలోకి వెళితే అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీలో ఆదర్శ పొదుపు సంఘం సభ్యులు బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు.ఆ రుణానికి సంబంధించి కొద్దిమేర మాత్రమే బకాయి ఉండటంతో అది చెల్లించి తిరిగి రుణం తీసుకుందామని బ్యాంక్‌కు వెళ్లారు. అక్కడ బకాయి వివరాలను పరిశీలించగా మూడు లక్షల రూపాయలు ఉండాల్సి ఉండగా 7 లక్షల రూపాయలుగా ఉంది. దీంతో ఒక్క సారి గా ఆందోళనకు గురైన సభ్యులు మెప్మాసీవో శ్రీలత దృష్టికి తీసుకు పోయారు. దీంతో ఆమె బ్యాంక్ లావాదేవీలు పరిశీలించగా మలాది గాయత్రి ఈ ఏడాది ఫిబ్రవరి 11 వ తేదీన 4 లక్షల రూపాయలు రుణం తీసుకున్నట్లు తేలింది. దీనికి తోడు మూడు నెలలుగా గాయత్రి మెప్మా కార్యాలయానికి కూడా రాకుండా వేరే గ్రామానికి వెళ్లింది. దీంతో కుటుంబసభ్యుల ద్వారా బుధవారం అద్దంకి మెప్మా కార్యాలయానికి పిలిపించారు. సభ్యుల సమక్షంలో మెప్మాసీవో శ్రీలత విచారించగా మరో పొదుపు సంఘానికి చెందిన అంజమ్మ అనే మహిళ సలహాతో 4 లక్షల రూపాయలు రుణం తీసుకున్నట్లు ఒప్పుకుంది. ఆ 4 లక్షల రూపాయలు తనకు ఇచ్చినట్లు అంజమ్మ కూడా ఒప్పుకుంది. దీంతో తీసుకున్న 4 లక్షల రూపాయలను వడ్డీతో పది రోజులలో చెల్లించే విధంగా ఆర్పీ గాయత్రి, మరో పొదుపు సంఘం సభ్యురాలు అంజమ్మల చేత ఒప్పందం కుదిర్చినట్లు సీవో శ్రీలత తెలిపారు. అయితే అంజమ్మ సభ్యురాలు గా ఉన్న పొదుపు సంఘానికి సంబంధించి ఇటీవల 20 లక్షల రూపాయల రుణం తీసుకోగా గత రెండు, మూడు నెలలుగా చెల్లింపులు జరగకపోవటంతో ఆ రుణం చెల్లింపులో కూడా ఏమైనా జరిగిందా లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



ఆర్పీ మోసంపై ప్రశ్నిస్తున్న పొదుపు సభ్యురాలు



కడప మహానాడులో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విద్యుత్ రంగాన్ని వైసీపీ సర్వనాశనం చేసింది

- మహానాడులో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): ఏ రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నా విద్యుత్ రంగం కీలకం అని సీఎం చం ద్రబాబునాయుడు చెబుతుంటారని విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడారు. దేశంలో మొట్టమొదట సారి విద్యుత్ సంస్కరణ లు తీసుకు వచ్చింది చంద్రబాబునాయుడు అనటంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రాష్ట్ర విభజన తరువాత కూడా రాష్ట్రంలో మిగులు విద్యుత్ తీసుకు వచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న కాలంలో విద్యుత్ వ్యవస్థ ను సర్వనాశనం చేయటమే కాకుండా చార్జీలను 9 సార్లు పెంచిందన్నారు. విద్యుత్ కోతలు విధించారన్నారు. ఇప్పటికి కూడా ఆ విద్యుత్ చార్జీలను మోయాల్సిన పరిస్థితి జగన్‌రెడ్డి తీసుకు వచ్చారని విమర్శించారు. అలాగే రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులను తరమికొట్టిన ఘనత జగన్‌రెడ్డిదే అన్నారు.

అన్నా మన్నించు...

- ఏడేళ్లుగా చెట్టు కిందనే విగ్రహాలు

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని కలవకూరు రోడ్డు కూడలి లో ఏడు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణ కోసం తొలగించిన ఎన్‌టీఆర్, పరిటాల రవి విగ్రహాలు తిరిగి ఏర్పాటు చేయలేదు. దీంతో ఏడు సంవత్సరాలుగా సమీపంలో రెండు విగ్రహాలు చెట్టు కింద గోడకు నిలబెట్టి ఉన్నాయి. బుధవారం ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా తెలుగు ప్రజలు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఈ వి గ్రహాల గురించి పట్టించుకున్నవారు కరువయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటిపోయినా ఇంకా ఎన్‌టీఆర్, పరిటాల రవీంద్రల వి గ్రహాల ఏర్పాటుపై తెలుగు తమ్ముళ్లు, నేతలు దృష్టి సారించకపోవటం విమర్శలకు తావిస్తోంది. బుధవారం కనీసం ఆ విగ్రహాలకు కొత్తగా దండలు కూడా వేయకపోటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



చెట్టు కింద గోడకు ఆనించిఉన్న ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలు

మోటార్‌బైక్‌లను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి): మోటార్‌బైక్‌ను వెనుక నుంచి ఆటో ఢీ కొనటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. కొరిశపాడు మండలం తమ్మవరంకు చెందిన కరిచేటి వెంకటరావు(41),



ప్రమాదంలో మృతిచెందిన కరిచేటి (ఇన్‌సెట్లో) వెంకట్రావు ఫైల్

అద్దంకి మండలం కలవకూరుకు చెందిన లక్ష్మీపతిలు బుధవారం మధ్యాహ్నం శింగరకొండ సమీపంలోని భవనాసి చెరువు వద్ద నుంచి వేర్వేరు బైక్‌లపై అద్దంకి వస్తుండగా మార్గమధ్యంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరావు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలైన లక్ష్మీపతిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కరిచేటి వెంకటరావు చేపల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో భవనాసి చెరువు వద్దకు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. వెంకటరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనాస్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించి కేసు నమోదు చేశారు.

వెంకటరావు మృతి బాధాకరం -మంత్రి రవికుమార్

రోడ్డు ప్రమాదంలో వెంకటరావు మృతి చెందటం బాధాకరం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఫోన్ చేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

తమ్మవరంలో విషాదఛాయలు

మేదరమెట్ల : శింగరకొండ అద్దంకి రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్మవరం గ్రామానికి చె ందిన కరిచేటి వెంకట్రావు మృతి చెందాడు. తమ్మవరం తెలుగుదేశం నాయకుడు కరిచేటి రాంబాబు తమ్ముడు అయిన వెంకట్రావు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మండలంలోని తెలుగుదేశం నేతలు వెంకట్రావు మృత దేహానికి నివాళులర్పించారు. రాంబాబును పరామర్శించి ధైర్యం చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన పర్చూరు - చీరాల రోడ్డులోని స్థానిక ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం సమీపంలో మంగళవారం అర్థరాత్రి చోటుచేసుకుంది. ఈప్రమాదంలో ఒక గేదెతోపాటు, మరో దూడకూడా మృతి చెందింది. అయితే గేదెలు ఎవరివి అనేది తెలియాల్సి ఉంది.

టిప్పర్ తగిలి అదుపుతప్పిన ద్విచక్ర వాహనం

- యువకునికి తీవ్ర గాయాలు

చీరాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనానికి టిప్పర్ చక్రం తగిలి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన బుధవారం మధ్యాహ్నం పర్చూరు - చీరాల రోడ్డులోని ప్రైడ్ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పర్చూరుకు చెందిన దుడ్డు దినేష్ స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై చీరాలకు వస్తున్నాడు. వీరి పక్కనే వెళుతున్న టిప్పర్ చక్రానికి వాహనం నడుపుతున్న దినేష్ కాలు తగిలి వాహనం అదుపు తప్పింది. ప్రమాదంలో దినేష్ కుడి కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు,మే28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన బిరుదు స్వామి (42) అనే దివ్యాంగుడు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. గతంలో జరిగిన ఓ ప్రమాదంలో స్వామికి ఓ కాలు తొలగించారు. ఈ నెల 26 వతేదీన మంచంపై నుంచి కిందకు దిగుతూ కట్టెలపొయ్యిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో అతనిని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య సుబ్బాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,మృతదేహానికి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు.

టీడీపీ సైనికులకు మహానాడు పెద్ద పండుగ

యోగా తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సైనికులకు, కుటుంబ సభ్యులకు అతి పెద్ద పండుగ మహానాడని, కడప గడ్డపై పెట్టి చరిత్రను సృష్టించిందని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం కడపలో రెండవ రోజు మహానాడు సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి యోగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని తెలుగు ప్రజలందరూ ఉత్సవంగా మహానాడును జరుపుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. తెలుగుజాతి మొత్తం ఆరాధించే వ్యక్తి ఎన్టీఆర్అని కొనియాడారు. ఎన్టీఆర్ ప్రేరణతో చంద్రబాబు మార్గదర్శకత్వంలో తెలుగుదేశం పార్టీ భవిష్యత్ ఆశాకిరణం యువ నాయకుడు మంత్రి లోకేష్ అని పేర్కొన్నారు. రాజకీయ సభలో యోగా తీర్మానం చేసి ప్రవేశపెట్టడం దేశ చరిత్రలో అరుదైన సంఘటన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై అపారమైన నమ్మకంతో యోగా డేని విశాఖపట్టణంలో నిర్వహించటానికి నిర్ణయం తీసుకున్నారని ఈసందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి

పంగులూరు, మే 28(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని డిప్యూటీ ఎంపీడీవో కె.సుమంత్ కోరారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలో బుధవారం జరిగిన గ్రామసభలో పారిశుధ్యం ప్రాధాన్యత, సూర్యఘర్ ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్, స్థానిక టీడీపీ నేతలు మాగులూరి రమేష్‌బాబు, వీరాంజనేయులు, రాజేంద్రప్రసాద్, దయాసాగర్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

అద్దంకి,మే28(ఆంధ్రజ్యోతి):అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, స్వామి సత్య సైన్య సేవాసమితి, జననీ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో బుధవారం అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వాసు , తిరుపతిరెడ్డి , పెద్దన్న ,బుల్లయ్య , చంద్రబాబు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

బల్లికురవ, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ పంచాయతీ శివార కోటవారిపాలెం గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ గుండెపోటుతో కూలీ అనుకు శ్రీనివాసరావు(48) మృతి చెందాడు. కోటవారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ శ్రీనివాసరావు రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ఒక్కసారిగా గుండె నొప్పితో కుప్పకూలి పడి పోయాడు. వెంటనే గమనించిన తోటి కూలీలు శ్రీనివాసరావును వైద్యశాలకు తరలించాలని ప్రయత్నించిన లోపే మృతి చెందాడు. కూలీ మృతిపై ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం తెలియజేశామని సిబ్బంది తెలిపారు.



మృతిచెందిన శ్రీనివాసరావు

పేద మహిళలకు కుట్టు మిషన్‌ల అందజేత

అద్దంకిటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): దాతలు అందించిన కుట్టు మిషన్‌లను జీవనోపాధిగా ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. బుధవారం శ్రీ వాసవి ధన్వంతరీ చారిటబుల్ ట్రస్ట్ తరపున ఎన్టీఆర్ 102 జయంతి సందర్భంగా స్థానిక గీతా మందిర్‌లో మున్సిపల్ కమిషనర్ పేద మహిళలు అనిత, శివ సుధారాణిలకు కుట్టు మిషన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరి ఉమ అన్నపూర్ణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి తిరునాళ్ల ఆదాయం రూ.6.64 లక్షలు

పర్చూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ తిరునాళ్ల సందర్భంగా భక్తులు వివిధ రూపాలో సమర్పించుకున్న కానుకల ఆదాయం రూ.6,64,837 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆలయంలో ఒంగోలు దేవదాయ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఆలయ వంశ పారంపర్య అర్చకులు తులసి , పెద్దకాపు ఆధ్వర్యంలో ఈవో పర్యవేక్షణలో కానుకల లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది కన్నా ఈఏడాది అమ్మవారి తిరునాళ్లకు రూ.75వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

గుండెపోటుతో పున్నయ్య మాస్టర్ మృతి

ఇంకొల్లు,మే 28,(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామానికి చెంచిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చందలూరి చెంచుపున్నయ్య(65) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు పున్నయ్య మాస్టర్ మృతి పట్ల ఉపాధ్యాసంఘాలు,ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

పేదలకు సాయం అందించాలి

మేదరమెట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగుదేశం శ్రేణులు పేదలకు సాయం అందించాలని తెలుగుదేశం నాయకులు కారుసాల నాగేశ్వరరావు(బాబు) అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పేద విద్యార్థిని కర్ణ తేజాకు గ్రామ తెలుగుదేశం నాయకులు మోపర్తి లక్ష్మీనారాయణ తన తల్లి మోపర్తి హైమావతి జ్ఞాపకార్థం 5 వేల రూపాయలను అందజేశారు.

మహానాడుకు తరలిన టీడీపీ నేతలు

బల్లికురవ. మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పండుగ అయిన మహానాడుకు బల్లికురవ మండలం నుంచి టీడీపీ నేతలు, యువత పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బుధవారం ఉప్పుమాగులూరు గ్రామ తెలుగు యువత వాహనాలను ఏర్పాటు చేసుకొని తరలి వెళ్లారు. అలానే కూకట్లపల్లి, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, బల్లికురవ, అంబడిపూడి గ్రామాల నుంచీ వెళ్లి మహానాడులో పాల్గొన్నారు.

మార్టూరులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

మార్టూరు,మే28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు కామేపల్లి హరిబాబు, శివరాత్రి శ్రీను తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇసుకదర్శి గ్రామంలో నాయకులు కేక్ కట్ చేశారు. మార్టూరులో బొడ్డురాయిసెంటరు వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి కమ్మ శివనాగేశ్వరరావు,చల్లగుండ్ల సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే వలపర్ల , మార్టూరు ఎంపీడీవో కార్యాలయంలో, యద్దనపూడి మండలంలో యద్దనపూడి, గన్నవరం,అనంతవరం,పూనూరు,యనమదల తదితర గ్రామాలలోజయంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు.

పర్చూరులో

పర్చూరు : ఎన్టీఆర్ జయంతి వేడుకలు పర్చూరు మండలంలో బుధవారం ఘనంగా జరిగాయి. పర్చూరు పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అదేవిధంగా మండలంలోని చిన్ననందిపాడులో సర్పంచ్ మువ్వా వెంకటశివ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చినగంజాంలో

చినగంజాం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన చినగంజాంలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతిని విస్మరించడం విశేషం.




పుట్టిన ప్రతీ బిడ్డకు ఎత్తు, బరువు చూడాలి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టిన ప్రతీ బిడ్డకు కచ్చితమైన ఎత్తు, బరువు నమోదు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం జరిగింది. ఈ ఆయన మాట్లాడుతూ తక్కువ బరువున్న శిశువులకు సరైన పోషణ, వైద్య సేవలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ సమయంలో పిల్లల శారీరక వృద్ధిని పర్యవేక్షించాలన్నారు. వృద్ధి రేటు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలని, పోషకాహారం, వైద్యసేవలు అందించి సాధారణ స్థితికి వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు.

ఈసారి రోహిణిలో
రోళ్లు పగలవ్!

వేసవి వచ్చిందంటే చాలు ప్రచండ భానుడి ప్రతాపానికి జిల్లా నిప్పుల కొలిమిలా మారుతుంది. ముఖ్యం గా మే నెలలో ఎండల తీవ్రతకు ప్రజలు విలవిల్లాడిపోతారు. ఇక రోహిణి కార్తె వచ్చిందంటే మరింత హడలిపోయేవారు. ఎండల ధాటికి జనం నీరసించడంతోపాటు రాత్రుళ్లు కూడా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసేది. కానీ ఈ ఏడాది మాత్రం జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. 'రోహిణి కార్తెలో రోళ్లు పగులతాయి.' అనే నానుడికి ముగింపు పలికినట్టుంది. ఈ నెల 25వ తేదీ ఆరంభమైన రోహిణి కార్తె జూన్ 15వ తేదీ వరకు ఉంటుంది.ఈ కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు, రాత్రిపూట వేడిగాలులు వీస్తాయి. మే నెలలో పగటి ఉష్ణోగ్రత 42 నుంచి 46 డిగ్రీల వరకు చేరుతుంది. అయితే ఈసారి మాత్రం జిల్లాలో విచిత్ర వాతావరణం నెలకొంది. నిప్పుల కణికలు కురిపించే రోహిణిని కారుమేఘాలు కమ్ముకున్నాయి. ముందే నైరుతి పలకరించడంతో భానుడి భగభగలకు తెర పడింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి, చల్లగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు. జిల్లాలో వారం రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మొత్తం మీద పరిశీలిస్తే ఉష్ణోతలు అనూహ్యంగా తగ్గాయి. బుధవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత 34, అత్యల్పం 29 డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. నైరుతి రుతుపవనాలు ముందుగా పలకరించడంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమవుతోంది. రుతుపవనాలు ముందస్తు రాకతో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)





వలేటివారిపాళెం : అంకభూపాలపురం నుంచి కడపకు తరలివెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

దారులన్నీ కడప వైపే!

ఐదేళ్ల అణచివేత తరువాత అధికారాన్ని చవిచూసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు మహానాడు ఉత్సవానికి ఉత్సాహంగా తరలివెళుతున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న తొలి మహానాడులో ప్రతిష్టాత్మకంగా గురువారం నిర్వహించే బహిరంగ సభలో ప్రత్యక్షంగా పాల్గొనడానికి జిల్లా నుంచి వేలాదిగా కదలి వెళుతున్నారు. కార్యకర్తల్లో పెల్లుబికుతున్న ఉత్సాహాన్ని మహానాడు ముంగిట వరకు తీసుకెళ్లడానికి వందల సంఖ్యలో ప్రభుత్వ, ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. అంతకు రెట్టింపు సంఖ్యలో సొంత వాహనాల్లోనూ ద్వితీయశ్రేణి నాయకులు, క్రియాశీల కార్యకర్తలు, అభిమానులు కడప దిశగా పోటెత్తుతున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- మహానాడుకు వేలాదిగా తరలుతున్న టీడీపీ శ్రేణులు
- ఆర్టీసీ బస్సులు 250.. ఇతర బస్సులు వందల్లోనే!
- ఇక సొంత వాహనాల్లోనూ సభకు పయనం

పార్టీ శ్రేణులను కడపకు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను బుధవారం సాయంత్రానికే పూర్తి చేసుకున్నారు. అర్ధరాత్రికల్లా వాహనాలు నిర్దేశిత పల్లెలకు, పట్టణ ప్రాంతాలకు చేరుకుంటాయి. బుధవారం ఉదయం 6 గంటలకు జిల్లా నుంచి కడపకు బయలుదేరనున్నాయి. మహానాడు బహిరంగ సభకు అవసరమైన వాహనాలను సమకూర్చుకునే విషయంలో టీడీపీ ప్రభుత్వం ఆర్టీసీకి కొంత మినహాయింపు ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో సీఎం బహిరంగ సభ జరిగితే ఆ సమీప జిల్లాల పరిధిలోని మెజారిటీ ఆర్టీసీ బస్సులన్నీ జనాలను తరలించడానికి వినియోగించేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో కేవలం 250 బస్సులను మాత్రమే కోరింది. 5వేలకుపైగా ప్రైవేటు బస్సులు, వ్యాన్లను సమకూర్చుకుంది. ఒక్కో నియోజకవర్గం నుంచి 5-7వేల మందిని మహానాడుకు తరలించడానికి అవసరమైన వాహనాలను ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు సొంతంగా సమీకరించుకున్నారు. ● నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి మంత్రి నారాయణ నాయకత్వంలో 5వేల మంది మహానాడుకు తరలివెళుతున్నారు. ఉదయం ఆరు గంటలకు ఈ వాహనాలు బయలుదేరుతున్నాయి. ● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నాయకత్వంలో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి 15 వేల మందిని తరలిస్తున్నారు. ● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో 10వేల మంది, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో 7వేల మంది, సర్వేపల్లి నుంచి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నాయకత్వంలో 6వేల మంది, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో 6 వేల మంది, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నేతృత్వంలో 5వేల మంది, కందుకూరు నుంచి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నాయకత్వంలో 2 వేల మంది మహానాడుకు వెళుతున్నారు. ● ఇక ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా వందలాదిగా టీడీపీ అభిమానులు సొంత వాహనాల్లో కడపకు తరలివెళుతున్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, జేసీ కార్తీక్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు

జయహో ఎన్టీఆర్!

- ఘనంగా నందమూరి జయంతి

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రఖ్యాత సినీ నటుడు నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో అధికారికంగా వేడుక జరిపారు. కలెక్టరేట్‌లో తిక్కన ప్రాంగణంలో నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, జేసీ కార్తీక్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజకీయ, సినీ రంగాల్లో ఆయన ఘనతను కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులను కలెక్టర్ ఆనంద్ సత్కరించారు. టీడీపీ జిల్లా కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ జయంతిని పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా జరిపారు.

6

అంతా గందరగోళం!



సర్దుబాటు ప్రక్రియలో కాంట్రాక్టు సిబ్బందికే ప్రాధాన్యం

రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్ల ఆందోళన

రేపటికి వాయిదా

నెల్లూరు (వైద్యం), మే 28 (ఆంధ్రజ్యోతి) : కీటక జనీత వ్యాధుల నియంత్రణలో హెల్త్ అసిస్టెంట్ల పాత్ర కీలకం. అలాంటి వారిని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సర్దుబాటు చేసి అవసరమైన చోట నియమించేందుకు వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే చాలా జిల్లాల్లో ఈ ప్రక్రియ జరిగిపోగా, నెల్లూరు జిల్లాలో మాత్రం 27వ తేదీన జరిగిన కౌన్సెలింగ్ రసాభాసగా మారింది. రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగుల జాబితా తయారీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించారంటూ రెగ్యులర్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లకే ప్రాధాన్యత ఇచ్చి జాబితా తయారు చేశారని ఆందోళనకు దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు బదులివ్వడంతో ఆ ఉత్తర్వులు చూపాలని హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. దీంతో ఈ ప్రక్రియను వాయిదా వేసి, 30న నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుజాత తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఈ సర్దుబాటు జరుగుతుండగా, రెగ్యులర్ ఉద్యోగులు 115 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 119 మంది ఉన్నారు. వీరిలో 12 మంది


- మిగతా 5లో..

సినిమా హాళ్లపై రెవెన్యూ దాడులు 5

'కలెక్టర్ ఇంటర్న్‌షిప్'లో చేరండి

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరాలని కలెక్టర్ ఆనంద్ గ్రాడ్యుయేట్ యువతను ఓ ప్రకటనలో కోరారు. గ్రాడ్యుయేట్లు, ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో చేరవచ్చని తెలిపారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ సైన్సెస్, డెవలప్‌మెంట్ స్టడీస్‌లో గానీ, ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లుగా పేర్కొన్నారు. 3 నుంచి 6 నెలల కాలవ్యవధితో చేసే ఈ ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రభుత్వంలో నేరుగా పనిచేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పనితీరును నేరుగా పరిశీలించి, జిల్లా స్థాయి అధికారు లతో మమేకమై, గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, ప్రభు త్వ విధానాలను విశ్లేషించడం, క్షేత్రస్థాయి సమ్యలకు పరిష్కారాలు కనుక్కోవడం తదితర కార్యకలాపాలతో ఈ ప్రోగ్రాం ఉంటుందని వివరించారు. ఆసక్తిగల వారు జూన్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరా రు. సంతృప్తికరంగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్, గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు.





అమ్మగారు వస్తున్నారహో!

బయటకు వస్తేచాలు కార్పొరేషన్ ఉద్యోగుల్లో హడల్

షాపింగ్ ఖర్చులన్నీ వీరే భరించాలట!

డబ్బుల్లేవంటే.. బెదిరింపు ధోరణిలో మాటలు

నెల్లూరు నగర పాలక సంస్థలో ఆయనో ఉన్నతాధికారి. సార్.. అంటేనే కాదు.. ఆయన సతీమణి మేడం అన్నా హడలిపోతున్నారు. ఇంటిలో నుంచి మేడం బయటకు వస్తున్నారని తెలిస్తే చాలు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల మొదలు ఆర్‌ఐల వరకు బెంబేలెత్తిపోతున్నారు. ఆమె ఎక్కడకు వెళ్లి ఏం కొంటారోనని బీతిల్లుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ఇటీవల ఆమె హ్యాండ్ క్రాఫ్ట్ తయారీ వస్తువుల కొనుగోలుకు ఓ షాపులోకి వెళ్లారు. పింగాణీ ప్లేట్ల నుంచి మొక్కలు పెట్టుకునే కుండీల వరకు అన్నీ కొనుగోలు చేశారు. మొత్తం రూ.17 వేల వరకు ఖర్చయింది. ఈ మొత్తం బిల్లు చెల్లించాలని అక్కడే ఆర్‌ఐను పిలిచి ఆదేశించారు. అయితే, సదరు ఆర్‌ఐ వద్ద అంత నగదు లేకపోవడం మేడం గారిలో ఆగ్రహం తెప్పించింది. 'మా ఆయన నీకు ఆర్‌ఐగా పోస్టింగ్ ఇప్పిస్తే ఆ మాత్రం ఖర్చుపెట్టలేవా!?' అంటూ మండిపడ్డారు. దీంతో సదరు అధికారి చేసేది లేక స్నేహితుల వద్ద నగదు తెప్పించుకుని షాపు యజమానికి చెల్లించాడు. కాగ ఆ వస్తువులన్నిటినీ ప్రత్యేక వాహనంలో తన అమ్మగారింటికి తరలించడం గమనార్హం.

- ఇంట్లో 20 మందితో సేవలు

కార్పొరేషన్‌కు చెందిన ఆ అధికారి నివాసం ఉంటున్న ఇంట్లో 20 మంది సిబ్బందితో సేవలు చేయించుకుంటున్నట్లు సమాచారం. కేవలం వంట కోసమే మధ్యాహ్నం వరకు నలుగురు, మధ్యాహ్నం నుంచి మరో నలుగురు ఉండగా, మరుగుదొడ్ల శుభ్రతకు ఒకరు, గార్డెన్ క్లీనింగ్‌కు మరొకరు, ఇల్లు శుభ్రతకు ఓ మహిళ, అధికారి అవసరాలకు మరో ఇద్దరు, పాత్రలు శుభ్రం చేసేందుకు ఏకంగా నలుగురు, వాచ్‌మెన్‌లుగా ముగ్గురు కొనసాగుతున్నారు. వీరంతా కార్పొరేషన్ ఖజానా నుంచి జీతాలు పొందుతుండటం విశేషం.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



నెక్లెస్ రోడ్డుపై యోగాసనాలు వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, జేసీ, ఎస్పీ తదితరులు

ఆరోగ్య యోగా

'యోగాంధ్ర'కు విశేష స్పందన

21న 10 లక్షల మందితో యోగా : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని నెక్లెస్ రోడ్డుపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెకర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్ మొదలు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని సామూహికంగా యోగా సాధన చేశారు. ప్రతీ ఒక్కరు యోగాను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న జిల్లాలో 10 లక్షల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

- వివరాలు 6లో..

బాల యాచకులు కనిపిస్తే చర్యలు

నెల్లూరు (హరనాథపురం) :బాల యాచకులను బడిలో చేర్పించిన తర్వాత మరలా యాచక వృత్తిలో కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. తిక్కన భవన్‌లో సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. దత్తత స్వీకరణ పిల్లల విషయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీవో సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష పీడీ వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ

- పాయింట్లే కీలకంగా అడుగులు
- ముగిసిన తొలిదశ ప్రక్రియ
- జిల్లాలో 6,106 దరఖాస్తులు

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ నెలకొంది. ఉద్యోగోన్నతులు, బదిలీల్లో పాయింట్లే కీలకంగా మారడంతో ఎవరికి వారు పాయింట్ల కోసం అన్ని రకాల దరఖాస్తులను సమర్పిస్తుంచారు. వీరిలో కొందరికి నెగటివ్, మరికొందరికి పాజిటివ్ పాయింట్ల కేటాయింపులతో టీచర్లు తాము కోరుకున్న స్థానం దక్కుతుందో లేదో అన్న ఆందోళనలో ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం కాకుం డా కొంత ఆలస్యం కావ డం, అభ్యంతరాలు వస్తుండటంతో అధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందోనంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతానికి దరఖాస్తులు ప్రక్రియ మొ త్తం పూర్తయిందని, తదుపరి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని చెబుతున్నారు.

- వివరాలు 6లో..



ఎస్‌ఏల ఉద్యోగోన్నతుల్లో గందరగోళం

- కౌన్సెలింగ్ నేటికి వాయిదా

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : బుధవారం జరగా ల్సిన స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియలో గందర గోళం నెలకొంది. షెడ్యూల్ ప్రకారం మంగళవారమే హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ పూర్తి కాకపోవడం, బుధవారం కూడా చేపట్టడంతో ఎస్‌ఏల ఉద్యోగోన్నతులు నిలిచి పోయాయి. కౌన్సెలింగ్ నిర్వహించే దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల వద్దనే రాత్రి వరకు ఎస్‌ఏలు ఎదురుచూపులు చూశారు. హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో పూర్తి చేసిన తరువాత వారికి ఆర్జేడీ కార్యాలయం నుంచి స్థానాల కేటాయింపుల ఉత్తర్వులు వెలువడాలి. అయితే బుధవారం కూడా ఈ ప్రక్రియ జరగడంతో ఎస్‌ఏల ఉద్యోగోన్నతలకు ఆటంకం ఏర్పడింది. హెచ్‌ఎంల ఉత్తర్వులు అనంతరం ఖాళీ అయ్యే స్థానాలను ప్రకటిస్తే ఎస్‌ఏలు ఆయా స్థానాలకు ఆప్షన్ ఎంచుకుంటారు. అయితే అధికారులు ముందస్తు ఆలోచన లేకపోవడం, అభ్యంతరాలు అధికమవడంతో షెడ్యూల్ ప్రకారం కాకుండా ప్రతిరోజూ ఆలస్యంగానే ఈప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఎస్‌ఏలకు సంబంధించి జడ్పీ యాజమాన్యంలో 89 మంది, ప్రభుత్వ యాజమాన్యంలో 8 మంది, మున్సిపాలిటీలో 4 కలిపి 101 ఉద్యోగోన్నతుల ప్రక్రియను బుధవారం రాత్రి నిలిపివేశారు. ఈ కౌన్సెలింగ్‌ను గురువారం నిర్వహిస్తామని అధికారులు అప్పటికప్పుడు ప్రకటించడంతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉంచి తమను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆవేదన చెందారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

విధుల్లో అలసత్వం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు డీఈఓ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో జి.మోక్షిత అనే విద్యార్థినికి సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో 84 మార్కులు రావాల్సి ఉండగా 21 వేసినందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్ మనుబోలు జడ్పీ స్కూల్ ఎస్‌ఏ ఎ.శాంతిని, స్పెషల్ అసిస్టెంట్ కోవూరు మండలం కొత్తూరు ప్రభుత్వ యూపీ స్కూల్ ఎస్‌జీటీ వి.సురేష్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

తెలుగులోనే పాఠాలు చెప్పాలి

- తెలుగు ఉపాధ్యాయుల విన్నపం

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు తెలుగు భాషను బోధన మాధ్యమంగా అమలు చేయాలని తెలుగు ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో బాలాజీ రావుకు వినతిపత్రం అందజేశారు. తెలుగు భాష విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. మాతృభాష లేకుంటే తెలుగు విద్యార్థుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. ప్రస్తుత బదిలీల్లో తెలుగు ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీంద్ర, సాగర్ మహేష్, పెంచలయ్య, హజరత్తయ్య, శ్రీనివాసులు, మండవ శ్రీనివాసులు, షేక్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న తెలుగు ఉపాధ్యాయులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100): 525	

4 నుంచి జనార్దనస్వామి ఆలయ భూముల కౌలు వేలం

కందుకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్కంధపురి జనార్దనస్వామి ఆలయానికి సంబంధించి కందుకూరు పట్టణం, మహదేవపురం, ఉలవపాడు మండలం కరేడు గ్రామాల పరిధిలో ఉన్న 154.31 ఎకరాల వ్యవసాయ భూములను మూడేళ్లపాటు కౌలుకు ఇచ్చేందుకు జూన్ 4, 5 తేదీలలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి భైరాగిచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు పట్టణ పరిధిలో 134.05 ఎకరాలకు, మహదేవపురంలో ఉన్న 4 ఎకరాల భూమికి 4వ తేది ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. కరేడు గ్రామంలో ఉన్న 16.26 ఎకరాల భూమికి జూన్ 5న ఉదయం 10 గంటలకు కరేడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. బహిరంగ వేలంలో భూములను కౌలుకు పాడుకున్న రైతులకు ఈ ఏడాది నుంచి మూడేళ్లపాటు సాగు చేసుకునే హక్కులు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. పాటలో పాల్గొనదలచిన రైతులు ఒక్కో ప్లాటుకు రూ.5వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని, హెచ్చుపాటదారులు ఒక ఏడాది కౌలు తక్షణం చెల్లించాలని తెలిపారు.

మా బిడ్డను ప్రభుత్వమే ఆదుకోవాలి

● బాధిత సచివాలయ ఉద్యోగి తల్లిదండ్రులు

కొండాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై కుడి చేయి మణికట్టు వరకు తొలగించడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ కుమారుడు మహేష్‌ను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడి తల్లిదండ్రులు మండలంలోని సాయిపేటకు చెందిన బీ.శ్రీహరి, సరస్వతి దంపతులు కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ తమ పెద్ద కుమారుడు మహేష్ పార్లపల్లి సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడని, విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పునరుద్ధరణ పనుల్లో భాగంగా గత సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు కాలిపోయాయన్నారు. పక్కనే ఉన్న సిబ్బంది వింజమూరుకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారన్నారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించగా శస్త్ర చికిత్స చేసి కుడిచేయి మణికట్టు వరకు తొలగించారన్నారు. ఇదిలా ఉండగా మహేష్ తండ్రి శ్రీహరి ఇటీవల అనారోగ్యానికి గురవ్వగా దాదాపు రూ26 లక్షల అప్పులు తెచ్చి వైద్యం చేయించుకున్నారు. ఇదే సమయంలో కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడుకి ఇలా జరగడంతో అతని వైద్యం కోసం మళ్లీ అప్పులు చేయాల్సి వస్తుందని తల్లి సరస్వతి ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతుందన్నారు. బాధితుడి మహేష్‌కు భార్య, రెండేళ్లలోపు పాప ఉన్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వం తమ బిడ్డను ఆదుకోవాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అర్జీలు పరిశీలిస్తున్న కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

వలేటివారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు శాఖలకు సంబంధించి 10 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం చుండి గ్రామంలో ఆక్రమణలో ఉన్న మహాలక్ష్మమ్మ దేవాలయం స్థలం, రాజు గారికోట స్థలంను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు సీఐ మంగారావు, తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో నరేంద్రదేవ్, ఎస్ఐ మరిడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటకరాణి కుటుంబానికి పలువురి పరామర్శ

బిట్రగుంట, మే 28(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన ఎన్టీఆర్ వీరాభిమాని నాటకరాణి అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం పలువురు టీడీపీ నేతలు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అంజయ్య కుమారుడు, బీసీ నేత నాటకరాణి భాస్కర్, తిరుపతయ్యలకు మండల కన్వీనర్ నాగేశ్వరరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎన్.సుధీర్‌బాబు, ఎన్.శీనయ్య, బోగిరి ప్రభాకర్, ఐ.రామోహన్‌రెడ్డి, ఎన్.రంగయ్య, అహ్మద్‌బాషా తదితరులు ఉన్నారు. అలాగే ఏబీకండ్రికకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గద్దే కొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కొలతలు ప్రకారమే వేతనాలు

వలేటివారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని ఉపాధిహామీ ఏపీవో దయాసాగర్ తెలిపారు. మండలంలోని కొండారెడ్డిపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. స్వయగా మస్టర్లను చదివి వినిపించారు. ఈ సందర్భగా ఏపీవో మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకు పనులకు వెళ్లి తిరిగి 10 గంటలకు ఇళ్లకు వెళ్లాలని సూచించారు.

ఆంధ్రుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

● వాడవాడలా అట్టహాసంగా జయంతి వేడుకలు

● ఘన నివాళులర్పించిన అధికారులు, టీడీపీ శ్రేణులు, అభిమానులు



కావలి : ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగు తమ్ముళ్లు



కందుకూరు : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు



కావలిరూరల్ : పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కావలి, మే 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల ఆరాధ్య దైవం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ శ్రేణులు కొనియాడారు. ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. కావలి మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9 నెలలకే అధికారం చేపట్టి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపనతో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చారన్నారు. తెలుగు సినీ పరిశ్రమకు అందించిన ఖ్యాతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, పోట్లూరి శ్రీనివాసులు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, యేగూరి చంద్రశేఖర్, గురుస్వామి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త, తదితరులు పాల్గొన్నారు. అలాగే ముసునూరులో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేత బొట్లగుంట శ్రీహరినాయుడు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కలిగిరి : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

● కావలి రూరల్ : కావలి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కొత్తపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి చిమ్మిలి శ్రీహరినాయుడు, పంచాయతీ కార్యదర్శి కత్తుల రాజేష్, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కందుకూరు : కందుకూరు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిలకపాటి మధు, గోచిపాతల మోషే, ఎస్వీ రమణయ్య, గొంది నరసింగరావు, రూబీ, జియా, పొన్నగంటి వెంకటరావు, మంగపాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పందలపాగులో గ్రామపార్టీ అధ్యక్షుడు కూనం లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు జెండా ఆవిష్కరణ చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.



కొండాపురం : కేకు కట్ చేసి తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● కొండాపురం : మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రైతు అధ్యక్షుడు పీ.రమేష్, తెలుగుయువత మండల అధ్యక్షుడు దాసరి అశోక్, తెలుగుయువత మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీను. గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, టీడీపీ నాయకులు నరేంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

● కలిగిరి : మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్రనాథ్, ఎంపీడీవో ప్రత్యూష, ఎస్ఐ ఉమాశంకర్, రెవెన్యూ, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● అల్లూరు : అల్లూరులోని ఆ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, అరగల రమణయ్య, మేడా శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, మేడా శ్రావణ్ కుమార్ రెడ్డి, కావలి జగన్మోహన్‌రావు, మునిరాజా, పఠాన్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు : ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు, సిబ్బంది ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా సచివాలయాలు, ఇతర శాఖ కార్యాలయాల్లో అధికారులు ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా మహానాడుకు మండలం నుంచి రెండు బస్సులు, 10కి పైగా టెంపోలు, కార్లులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం తరలి వెళ్లారు. కరేడు, ఉలవపాడు మేజర్ పంచాయతీలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బస్సులు కేటాయించారు.

● జలదంకి : మండలం బ్రాహ్మణక్రాక పంచాయతీ తొమ్మిదోమైలు ఎన్‌హెచ్ 167బిజి జాతీయ రహదారి కూడలిలో టీడీపీ నాయకులు గంగపట్ల మాలకొండయ్య, స్వర్ణ కొండపనాయుడు, డాక్టర్ పీవీ రమణయ్యలు ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, నాయకులు తల్లపనేని మధుసూదనరావు, కొల్లా కృష్ణ, పున్నం రోశిరెడ్డి, వడ్డే శ్రీనివాసులు, కూరపాటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

● బిట్రగుంట : బోగోలు టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయింతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.సుధీర్‌బాబు, ఐ.రామోహన్‌రెడ్డి, ఎల్.మాధవరావు, బీ.ప్రభాకర్, రమణయ్య, అహ్మద్ బాషా, రఫీభాయ్, తదితరులు పాల్గొన్నారు



ఉలవపాడు : ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది



జలదంకి : ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



బిట్రగుంట: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

అంతా గందరగోళం

(3వ పేజీ తరువాయి)

హెల్త్ అసిస్టెంట్లకు సర్దుబాటు బదిలీల్లో మినహాయింపు ఇవ్వడంపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

● వారికి బదిలీలు లేవట!


మరోవైపు జిల్లా కార్యాలయంలోని ఫైలేరియా విభాగంలో 8 మంది, మలేరియా విభాగంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే వీరిని బదిలీల కౌన్సెలింగ్ జాబితాలో మాత్రం చేర్చలేదు. నెల్లూరుకు కూత వేటు దూరంలో ఉన్న అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్ల పేర్లను తొలి జాబితాలో చేర్చి ఆ తర్వాత తొలగించారు. దీని వెనుక మర్మమేమిటో అధికారులే చెప్పాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. తాజాగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలోనూ హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పోటీ ఎక్కువైంది. నగరంలోనే 20 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, కావలిలో 4, కోవూరు. ఆత్మకూరులలో ఒక్కొక్కటి చొప్పున ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ హెల్త్ అసిస్టెంట్లను కొత్తగా నియమిస్తున్నారు. మరోవైపు ఆత్మకూరు, మహమ్మదాపురం, కలువాయి, పొదలకూరు, చిరమన, చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెల్త్ అసిస్టెంట్ల అవసరం ఉన్నా ఆ దిశగా అధికారులు జాబితా తయారు చేయక పోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే!

వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ సర్దుబాటు బదిలీలు జరుగుతున్నాయి. ఈ నెల 27న కౌన్సెలింగ్ జరగాల్సి ఉన్నా ఉద్యోగుల అభ్యర్థన మేరకు 30కి వాయిదా వేశాము. మలేరియా విభాగం ఆదేశాలతోనే హెల్త్ అసిస్టెంట్ల జాబితా తయారు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కౌన్సెలింగ్‌లో కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రాధాన్యత ఇస్తున్నాము.

- సుజాత, డీఎంహెచ్‌వో

సినిమా హాళ్లపై రెవెన్యూ దాడులు



కావలిలోని థియేటర్లలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లపై చర్చ సాగుతున్న సమయంలో జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ అధికారులు బుధవారం తనిఖీలు ప్రారంభించారు. థియేటర్లలో టికెట్లు, తినుబండారాలు, కూల్ డ్రింక్స్ ధరలు, పారిశుధ్యం, అగ్నిమాపక శాఖ అనుమతులు, సౌకర్యాలు ఇలా అనేక అంశాలపై తనిఖీలకు తెర లేపారు. నెల్లూరు, కందుకూరు, కావలి ఆర్డీవోలు నాగ సంతోష్ అనూష, శ్రీపూజ, సన్నీ వంశీకృష్ణ ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేశారు. నగరంలో ఎమ్మార్వో షఫీమాలిక్ తనిఖీలు చేశారు. ఈ రిపోర్టును ప్రభుత్వానికి అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సినిమా టికెట్ల ధర పెంచితే చర్యలు

కందుకూరు, మే 28(ఆంధ్రజ్యోతి): సినిమా హాళ్లలో టికెట్ల ధరలు పెంచినా, తినుబండారాలు అధిక ధరలకు విక్రయించిన ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ హెచ్చరించారు. బుధవారం కందుకూరు పట్టణంలోని ప్రశాంతి, కోటేశ్వర, యువరాజ్ థియేటర్లకు ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, సీటింగ్ సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. క్యాంటీన్‌లలో వివిధరకాల పదార్థాలు విక్రయ ధరలు, టికెట్ల ధరలు తదితర అంశాలను పరిశీలించారు. ఆయా థియేటర్లలో లైసెన్స్‌డ్ ఆపరేటర్లు ఉన్నారా లేదాని విచారించారు. ఆయా థియేటర్ల మేనేజర్లతో మాట్లాడి మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత మెరుగుపరచుకోవాలని సూచించారు. క్యాంటీన్‌లలో వస్తువులు అధిక ధరలకు విక్రయించినా టికెట్లపై అధికధరలు వసూలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు థియేటర్ల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వారు ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని సబ్‌కలెక్టరు వివరించారు.

కావలి : పట్టణంలోని మానస, శ్రీవెంకటేశ్వర, స్పందన థియేటర్లను తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్‌తో కలిసి కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణ తనిఖీ చేశారు. ఆ సమయంలో సినిమా ప్రదర్శనలు లేకపోవటంతో థియేటర్లలోని అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతులు. ఫైర్ పరికరాలు, సీటింగ్ కెపాసిటీ, పార్కింగ్ తదితరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సినిమా టికెట్ ధరపై రికార్డులను, కంప్యూటర్లను పరిశీలించారు. సినిమా థియేటర్లలోని క్యాంటీన్‌లలో తినుబండారాలు, వాటర్‌బాటిల్స్, కూల్ డ్రింక్స్ ఎమ్మార్పీకి విక్రయిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అయితే వారు తనిఖీలకు వెళ్లిన సమయంలో సినిమా ప్రదర్శనలు లేకపోవటంతో థియేటర్ల నిర్వాహకులు అన్ని నిబంధనల మేరకే జరుగుతున్నాయని చెప్పడంతో వాటిని క్రాస్ చెక్ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

లింగసముద్రం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు లింగసముద్రంలోని విజయలక్ష్మి. బాలాజీ థియేటర్లను తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఆర్ఐ ఎం రమణయ్యలు తనిఖీ చేశారు. వీరి వెంట వీఆర్వో మస్తాన్‌వలి ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కావలి, మే 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో పనిచేస్తున్న దినసరి పారిశుధ్య కార్మికులకు 4 నెలలుగా జీతలు ఇవ్వలేదని, వెంటనే వారికి జీతాలు ఇవ్వాలని సీఐటీయూ అనుబంధ కార్మికసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ దినసరి పారిశుధ్య కార్మికులకు 4 నెలలుగా జీతాలు ఇవ్వనందున నిరుపేదలైన వారి కుటుంబాలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కరోనా కాలం నుంచి పని చేస్తున్న వారికి తక్కువ జీతాలు ఇస్తూ ఎక్కువ పనులు చేయిస్తున్నారని చెప్పారు. వారందరినీ ఆప్కాస్‌లో చేర్చుకుని 60 ఏళ్లకు పదవీవిరమణ పొందిన వారికుటుంబ సభ్యులలో ఒకరికి పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిరదల మహేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో గ్రామీణ రహదార్లు!

● పట్టించుకోని అధికారులు



కలిగిరి-కొండాపురం ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

కలిగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రధాన రహదారులు దుస్థితిలో ఉన్నాయి. అడుగడుగున గుంతలు పడి, వర్షం వస్తే ఆ గుంతల్లో నీరు చేరి ప్రమా దకరంగా ఉన్నాయి. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవతోన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. అయితే విధుల్లో అలసత్వమో ఏమోకానీ కొందరు అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కలిగిరి నుంచి కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ రహదారుల్లో నిత్యం సామాన్య ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు ప్రయాణాలు చేస్తున్నా రహదారుల దుస్థితిపై ఎవరూ పట్టించుకున్న దాఖాలాలు కనిపించడం లేదు. కలిగిరి-సంగం రహదారిలో పాతనాపురం నుంచి హసనాపురం మధ్య సింగిల్‌రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. కలిగిరి-కొండాపురం మార్గంలో పలుచోట్ల రహదారులు గుంతలు తేలి ఆనవాళ్లు లేకుండా పోయాయి. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దెబ్బతిన్న రహదారులపై ప్రయాణించాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కలిగిరి-కొండాపురం మార్గంలో కలిగిరి శివారు ప్రాంతంలో తారురోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిపోయింది. ఈ గుంతల వద్ద రోడ్డు పరిస్థితి అంచనా వేయలేకపోవడంతో అదుపుతప్పి పడి గాయపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా సరే వారం రోజులపాటు నీరు నిల్వ చేరి వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంటుంది. వర్షపునీరు బురదమయంగా మారి, దుర్వాసన వెదజల్లుతూ అంటురోగాలకు కారకం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్గాలవద్ద రహదారులకు మరమ్మతులు నిర్వహించి వాహనదారుల కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తాం

కలిగిరి శివారు ప్రాంతంలో రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో 350 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. స్థానికుల ఇళ్లు రోడ్డు పైకి చొచ్చుకుని రావడంతో పనులు మొదలు కాలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తాం.

- అహ్మద్‌బాషా, జేఈ,ఆర్అండ్‌బీ, కావలి డివిజన్

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

కలిగిరి మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు దూబగుంట సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడి పందెం స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు చేశారు. పందేలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కోళ్లు, రూ.2,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

వలేటివారిపాలెం, మే 28 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు మండలంలోని అంకభూపాలపురంనకు చెందిన టీడీపీ నాయకులు బుధవారం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కమంతులు మాల్యాద్రి, పంది లక్ష్మీనారాయణ, చెంచు శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలిగిరిలో పొగాకు ధరలు

కలిగిరి, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు మొత్తం 532 పొగాకు బేళ్ల అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 437బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-80, ఆర్ఆర్-4, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 95బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.240.67గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ముస్తాబైన రామాలయం

వలేటివారిపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లవారిపాలెంలో గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న రామాలయంను కూలదోసి రూ.70 లక్షలతో నూతన రామాలయం నిర్మించారు. అందులో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ




వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు




మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

యోగాతో ఆరోగ్యం

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ
- 'యోగాంధ్ర'కు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన సాధకులు

నెల్లూరు(విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులోని నెక్లెస్ రోడ్డుపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. కలెకర్, జేసీ, ఎస్పీ మొదలు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని సామూహికంగా యోగా సాధన చేశారు. కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ యోగా కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో విస్తరించేందుకు అధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరికి యోగాను దినచర్యలో భాగం చేయాలన్నారు. జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపారు. అదే రోజున జిల్లాలో జరిగే కార్యక్రమంలో పది లక్షల మంది యోగాసనాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శిక్షణ పొందిన 300 మంది మాస్టర్ ట్రైనర్స్ అన్నీ గ్రామ, వార్డు స్థాయిల్లో 7వేల మందికి శిక్షణ ఇచ్చారన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో ప్రజలతో యోగాసనాలు వేయిస్తారని తెలిపారు. అనంతరం యోగా గురువులను సత్కరించారు. యోగా ప్రాముఖ్యతను తెలిపే పుస్తకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, టూరిజం ఆర్డీ రమణ ప్రసాద్, ఆయుష్ ఆర్జేడీ డాక్టర్ పద్మావతి, నగర కమిషనర్ నందన్, ఏఎస్పీ సౌజన్య, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, జిల్లా యోగా సమితి అధ్యక్షుడు విజయ్ కుమార్, కార్యదర్శి పెంచలయ్య, యోగా శిక్షకులు పాల్గొన్నారు.


యోగా సాధన చేస్తున్న కలెక్టర్, అధికారులు, ప్రజలు

ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్కంఠ

- ముగిసిన తొలిదశ ప్రక్రియ
- జిల్లాలో 6,106 దరఖాస్తులు

నెల్లూరు (విద్య), మే 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో వారికి కేటాయిస్తున్న ఎన్‌టైటిల్‌మెంట్ పాయిం ట్లు ఎంతో కీలకంగా మారుతున్నాయి. కోరుకున్న స్థానాలు దక్కించుకోవాలంటే అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. కొంతమంది పాయింట్లు పొందేందుకు తమకు వర్తించని అంశాలను దరఖాస్తులో పొందుపరిచి లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని కొన్ని సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రధానంగా స్టేషన్ పాయింట్ల కేటాయింపుల్లో నోటిఫికేషన్‌లో ఇచ్చిన విధంగా ఈ ఏడాది బదిలీలకు విద్యా సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నా రు. హెచ్‌ఎంలకు ఐదేళ్లు, ఇతర టీచర్లకు ఎనిమిదేళ్ల గరిష్ఠంగా పూర్తయితే వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. ఇక విద్యాసంవత్సరంలో 9 నెలలు పనిచేస్తే దానిని పూర్తి విద్యా సంవత్సరంగా పరిగణిస్తున్నారు. ఏడేళ్ల పది నెలలు పూర్తయినా ఎనిమి దేళ్లుగా పరిగణించి తప్పనిసరి బదిలీల జాబితాల్లో చేర్చుతారు. దీని కనుగుణంగా పలువురు దరఖాస్తు చేసుకోగా వీరికి 8 సంవత్సరాలకు బదిలీ పాయింట్లు కేటాయించకుండా ఏడేళ్ల 10 నెలలు మాత్రమే లెక్కించి పాయింట్లు కేటాయిస్తుండడంతో ఆయా టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు తొమ్మిదేళ్ల పనిచేసిన వారికి కూడా ఒక ఏడాది తగ్గించి ఎనిమిదేళ్లకే పాయింట్ల కేటాయించడాన్నీ వ్యతిరేకిస్తున్నారు.

పాయింట్లే కీలకం

బదిలీల్లో పాయింట్లే కీలకం కావడంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా స్పౌజ్ విషయంలో కొందరు ఉపాధ్యాయులు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి. ఈ పాయింట్ల కోసం ఎలాంటి సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకపోవడంతో దరఖాస్తు సమయంలో స్పౌజ్ పొందారని చెపుతున్నారు. భార్యాభర్తలు ఉద్యోగులలైనే ఈ ఎనిమిదేళ్లలో బదిలీల్లో ఒకరికి స్పౌజ్‌ను వినియోగించాలి. కానీ కొంతమంది గత బదిలీల్లో ఒకరు, ఈ బదిలీల్లో మరొకరు వినియోగించుకుంటున్నారని గగ్గోలు పెడుతున్నారు. నిబంధనల ప్రకారం భార్యాభర్తలిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఎయిడెడ్, స్థానిక సంస్థలు ప్రభుత్వ సొసైటీల్లో పనిచేసే వారికి మాత్రమే స్పౌజ్ పాయింట్లు కేటాయిస్తారు. దీనికి భిన్నంగా కొంతమంది అర్హత లేకపోయినా పాయింట్లు పొందేలా పావులు కదుపుతున్నారని ఆరోపిస్తున్నారు. వీటన్నిటిపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వచ్చిన దరఖాస్తులు ఇవీ..

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి మొత్తం 6,106 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం ఈ బదిలీల ప్రక్రియను జూన్ 11 నాటికి పూర్తిచేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు 139, లాంగ్వేజ్ పండిట్ విభాగంలో హిందీ 12, సాంస్కృతికం 1, తెలుగు 73, ఉర్దూ 2 కలిపి 88 దరఖాస్తులు వచ్చాయి. ఫిజికల్ ఎడ్యుకేషన్ 26, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు 82, స్కూల్ అసిస్టెంట్స్ లాంగ్వే జెస్ విభాగంలో ఇంగ్లీష్ 418, హిందీ 270, తెలుగు 400, ఉర్దూ 7, నోసబ్జెక్ట్ 1 కలిపి 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్ విభాగంలో బయలాజికల్ సైన్స్ 321, మ్యాథ్స్ 566, ఫిజికల్ ఎడ్యు కేషన్ (పీడీ) 141, ఫిజికల్ సైన్స్ 381, సోషల్ 327, స్పెషల్ ఎడ్యుకే షన్ 12 కలిపి 1748 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,927 మంది మొత్తం 6,106 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రత్యేక బృందాలు వీటిని పరిశీలించి తుది జాబితాలను విడుదల చేయనున్నాయి.

సోమశిల దక్షిణ కాలువలో చిరుత కళేబరం


చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కలువాయి, మే 28 (ఆంధ్రజ్యోతి): కలువాయి మండలం చింతలాత్మకూరు సమీపంలోని సోమశిల దక్షిణ కాలువలో ఓ చిరుత కళేబరాన్ని బుధవారం స్థానికులు గుర్తించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని కాలువ లో నుంచి కళేబరాన్ని బయటకు తీసి పరిశీలించారు. చిరుత కళేబరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో నీటి కోసం కాలువలోకి దిగి తిరిగి రాలేక నీటిలో పడి మృతి చెంది ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. పంచనామా అనంతరం పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహిస్తామని కలువాయి డీఆర్వో ఖాజారసూల్, బీట్ ఆఫీసరు రాహుల్ తెలిపారు. చిరుతకు ఏడాది వయసు ఉంటుందని అంచనా వేశారు. కాగా, దక్షిణ కాలువకు ఇటీవలే కలువాయి చెరువు నుంచి 120 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- ఆంజనేయస్వామి రాతి విగ్రహం వెలికితీత

వలేటివారిపాలెం, మే 28(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం శివారు ప్రాం తంలో శిథిలమైన పురా తన జనార్దనస్వామి ఆల యం ప్రాంగణంలో కోటకట్టలో గుర్తు తెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసి సుమారు 10 అడుగుల ఆంజనేయస్వామి రాతి విగ్రహాన్ని వెలికి తీసిన ఘటన ఆలస్యంగా బుధ వారం వెలుగు చూసింది. వెలికితీసిన విగ్రహా న్ని పక్కనే ఉన్న వేప చెట్టుకు నిలబెట్టారు. ఇక్కడి పరిస్థితులను బట్టి ఎక్సకవేటర్‌తో తవ్వకాలు జరిపి ఆంజనేయస్వామి విగ్రహాన్ని పక్కన వేప చెట్టుకు నిలబెట్టి, తవ్విన గుంతను మళ్లీ పూడ్చి వేశారు. విగ్ర హాన్ని వెలికితీసిన ప్రదేశంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు దీపారాన ఒత్తులు, నువ్వుల నూనె డబ్బాలు పడి ఉన్నాయి. అటు వైపు పొలాలకు వెళ్లిన గొర్రెల కాపరులు చూసి గ్రామస్థులకు తెలియజేశారు. గ్రామస్థులు వెళ్లి ఆంజనేయస్వామి విగ్ర హాన్ని పరిశీలించారు. అయితే ఈ ఘటన నాలుగైదు రోజుల క్రితం జరిగి ఉంటుం దని భావిస్తున్నారు. గతంలోనూ పాడుబడిన జనార్దనస్వామి ఆలయం గర్భగుడిలో దేవాతా మూర్తుల విగ్రహాలను సైతం పెకలించారు. ఆలయం ముందు ఉన్న రాతి ధ్వజస్తంభం కింద పలుమార్లు తవ్వకాలు చేపట్టారు.. అలాగే సమీపంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని గర్భగుడిలో శివలింగాన్ని పెకలించి ధ్వంసం చేశారు. గర్భగుడి ముందు ఉన్న నంది, ఆలయం ముందు ఉన్న మరో నంది విగ్ర హాలను తవ్వి అపహరించుకెళ్లారు. ఈ ఘటనలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డంతో బరితెగించిన దుండగులు ఇప్పటికీ పాడుబడిన ఆలయ ప్రాంగ ణంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికులు భావిస్తున్నారు. వాస్తవానికి 15వ శతాబ్దం శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఈ ప్రాంతంలో 101 దేవాలయాలు, 101 చింత చెట్లు, 101 కోనేరులు ఉండేవని, అప్పట్లో ఈ ప్రాంతాన్ని పుచ్చకాయలరెడ్లు పాలించేవారని పూర్వీకులు చెబుతుండేవారు. అప్పట్లో విగ్రహాలను ప్రతిష్ఠించేటప్పుడు పంచలోహాలు వేసి ప్రతిష్ఠించేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని దుండగులు గుప్తనిధులు కోసం ఆ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా దుండగులపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వలేటివారిపాలెం జనార్దన స్వామి ఆలయ ప్రాంగణంలో గుప్తనిధుల కోసం తవ్వి వేప చెట్టుకు నిలబెట్టిన ఆంజనేయస్వామి రాతి విగ్రహం

తెలుగు హృదయాల్లో ఎన్టీఆర్ పదిలం

- జయంతి వేడుకల్లో నుడా చైర్మన్ కోటంరెడ్డి
- ఆకట్టుకున్న ఎగ్జిబిషన్, సాంస్కృతిక ప్రదర్శనలు

నెల్లూరు (హరనాథపురం), మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల గుండెల్లో నందమూరి తారక రామారావు స్థానం పదిలంగా నిలిచి ఉంటుందని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ చలనచిత్ర నటుడు, పద్మశ్రీ డాక్టర్ ఎన్‌టీ రామారావు జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కార్తీక్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారం చేపట్టిన ఏకైక నాయకుడన్నారు. పాలనలో అనేక సంస్కరణలతో పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నన్నపరెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతినకూడదనే గొప్ప లక్ష్యంతో పార్టీని స్థాపించి చరిత్ర సృష్టించిన తెలుగు తేజం ఎన్టీఆర్ అని కొనియాడారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితో మన రాష్ట్రం అన్నీ రంగాల్లో ముందంజలో పయనించేలా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.


కళాకారులను సన్మానిస్తున్న కలెక్టర్

కళా ప్రదర్శనలు.. సత్కారం

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కళాకారులు ఆలపించిన దేశభక్తి గీతాలు, పౌరాణిక సన్నివేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భాస్కర్, మధుసూదన్ పాడిన పుణ్యభూమి నాదేశం, జననీ జన్మభూమిశ్చ తదితర పాటలు, నరసింహారావు దుర్యోధన ఏకపాత్ర అభినయం అలరించాయి. కళాకారుల ను కలెక్టర్ ఆనంద్ సత్కరించి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దుర్యోధన ఏకపాత్రాభినయాన్ని తిలకిస్తున్న కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు, చిత్రంలో ఎన్టీఆర్ ఫొటో ఎగ్జిబిషన్ కూడా చూడవచ్చు

ప్రత్యేక ఆకర్షణగా ఫొటో ఎగ్జిబిషన్

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిని మా, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సేవలను గుర్తు చేసేలా రూపొందించిన చిత్రాలు ఆనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చాయి. కలెక్టర్ ఆనంద్, నుడా చైర్మన్ కోటంరెడ్డి, జేసీ కార్తీక్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి, డీఆర్వో ఉదయభాస్కర్ ఈ ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. సమాచారశాఖ అధికారి సదారావును, సిబ్బందిని అభినందించారు.